www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 శనివారం

# వెలుతురు

రంగారెడ్డి। 30, మార్చి 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 310, పేజీలు: 12, వెల: రూ.5/-

## భక్తులతో కిక్కిరిసిన మెదక్ చర్చి

### గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



**మెదక్, మార్చి 29,(వెలుతురు):** ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చికి శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా భక్తులు పోటెత్తారు. చర్చితో పాటు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. మత పెద్దలు వేకువజామున శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పరిసరాలు ఏసు నామస్మరణతో మార్మోగాయి. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశాన్ని వినిపించారు. జనుల పాపములను పోగొట్టేందుకు ఏసు ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్‌ఫ్రైడే అని చెప్పారు. చెడుపై మంచి, పాపముపై నీతి సాధించిన విజయానికి సూచికగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటామని వెల్లడించారు. ప్రతిఒక్కరూ ప్రేమ, దయ, శాంతి, సహనం, త్యాగం, శత్రువునైనా ప్రేమించే గుణం కలిగి ఉండాలన్నారు.

# నన్ను పిచ్చోణ్ణి చేశారు..!

- రంజిత్, మహేందర్‌రెడ్డి.. ఆస్కార్ స్థాయి నటులు
- పార్టీ మారబోమని నా ముందే లొల్లి పెట్టుకున్నారు
- కట్ చేస్తే..15 రోజుల్లోనే ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు
- 'పట్నం' వెన్నుపోటు వల్లే తాండూరులో ఓడిపోయాం
- కేకే, కడియం.. కష్టకాలంలో పార్టీని వీడి వెళ్తున్నారు
- పార్టీ మారుతున్న ద్రోహులకు ప్రజలే బుద్ధి చెప్తారు
- వాళ్లు కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. మళ్లీ రానివ్వం
- కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేసుకుంటాం
- 13న చేవెళ్లలో కేసీఆర్ సభను జయప్రదం చేద్దాం
- బీజేపీని ఆపే బలం స్థానిక పార్టీలకే ఉంది: కేటీఆర్
- పార్టీని వీడుతున్నది దొంగలు, ద్రోహులే
- బీఆర్ఎస్ కార్యకర్తలను ఎవ్వరూ కొనలేరు: హరీశ్



**హైదరాబాద్, మార్చి 29 (వెలుతురు):** "కాంగ్రెసలోకి నేను పోతలేనంటే.. నేనూ పోతలేనని.. నేను మంచోడినంటే.. నేను మంచోడినని పరిగి సభలో పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి నా ముందే లొల్లి పెట్టుకున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీతల కన్నా ఎక్కువగా నటించారు. ఇద్దరూ కలిసి నన్ను పిచ్చోణ్ణి చేశారు. నేను కూడా వాళ్ల మాటలు నమ్మా.. ఇక చేవెళ్ల సీటు గెలిచినమనే అనుకున్నా. కానీ.. సీన్ కట్ చేస్తే 15 రోజుల వ్యవధిలోనే కాంగ్రెసలో చేరి ఒకరు మల్కాజిగిరి, మరొకరు చేవెళ్ల సీటు తెచ్చుకున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొందిన కొందరు నాయకులు.. కష్ట కాలంలో సొంత ప్రయోజనాలకోసం పార్టీ మారి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలా ద్రోహం చేసి వెళ్తున్న వారిని క్షమించబోమని, భవిష్యత్తులో కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. పార్టీలోకి రానివ్వబోమని తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీని వీడే నాయకులు వెళ్తూ వెళ్తూ కొన్ని రాళ్లు వేసి వెళ్తారని, అది వారి విజ్ఞతకే వదిలేద్దామన్నారు. ఏదేమైనా.. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. "అసెంబ్లీ ఎన్నికల వేళ చేవెళ్ల పార్లమెంటు పరిధిలో కొన్ని చోట్ల నేనూ ప్రచారం చేశాను. తాండూరు అసెంబ్లీ సీటు ఏకపక్షంగా గెలుస్తామనుకున్నాం. ఏం జరిగిందో తెలియదు.. కొన్ని చోట్ల ఓడియాం. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడని అంటారు.. ఆ కోవలోనే.. అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ నేతలకే పట్నం మహేందర్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు. వారి ఓటమికి కారణమయ్యారు. ఇక.. రంజిత్‌రెడ్డి విషయానికి వస్తే ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నాకు ఫోన్ చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా నన్ను ప్రకటించండి.. తప్పకుండా గెలుద్దాం.. అని స్వయంగా చెప్పారు. తీరా చూస్తే ఎమ్మెల్సీ కవిత అరెస్టయిన రోజే నవ్వుకుంటూ.. వెళ్లి కాంగ్రెసలో చేరారు. పార్టీకి ద్రోహం చేసిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిపై కార్యకర్తలు పగ తీర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం చేవెళ్లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి" అని సూచించారు. ఇలాంటి కష్ట కాలంలో కేకే, కడియం వంటి నాయకులు పార్టీ వదిలిపెట్టి వెళ్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

### 13న చేవెళ్ల సభను విజయవంతం చేద్దాం

వచ్చే నెల 13న కేసీఆర్ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. చేవెళ్ల పార్లమెంటులో నిలబడ్డది కాసాని జ్ఞానేశ్వర్ కాదు... కేసీఆర్ అన్నట్టుగానే పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ముఖ్య నాయకులు పార్టీని వదిలి వెళ్లినా సరే.. పార్టీ కేడర్ కోసం తానే స్వయంగా పని చేస్తానన్నారు. ఇన్ని రోజులు పార్టీ కోసం, నాయకుల కోసం పని చేసిన కార్యకర్తలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు.

### బీజేపీని ఆపే శక్తి కాంగ్రెసకు లేదు

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అంటూ ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి.. ఎన్నికల తర్వాత ఆయనే బీజేపీకి బీ టీమ్‌లా మారారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి సీఎం అయిన ఆయన రాహుల్ కోసం పనిచేస్తున్నారా? మోదీ కోసం పని చేస్తున్నారా? చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెసకు ఓటు వేస్తే.. బీజేపీకి లాభమవుతుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. బీజేపీని ఆపే బలం స్థానిక పార్టీలు, స్థానిక నేతలకే ఉందని, కాంగ్రెసకు ఆ శక్తి లేదన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి దేశవ్యాప్తంగా 40ఎంపీ సీట్ల కన్నా ఎక్కువ వచ్చే పరిస్థితి లేదని జోస్యం చెప్పారు. సిటింగ్ స్థానమైన మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేయాలన్న సవాల్‌పై వెనుకంజ వేసిన రేవంత్‌రెడ్డి.. అన్ని సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. "నల్లగొండ, ఖమ్మం నేతలే మానవ బాంబులు అవుతారు జాగ్రత్త.. అయిదేళ్లు.. సీఎం పదవిని కాపాడుకో" అని రేవంత్‌ను ఉద్దేశించి అన్నారు. కాగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### పోరాటపథంలో కదం తొక్కుదాం

రాష్ట్రంలో నిఖార్సయిన కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ పోరాట పంథాలో కదం తొక్కుదామని పార్టీ శ్రేణులకు 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. శూన్యం నుంచి సునామీ సృష్టించి.. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీశాలి కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే వారికి ప్రజలే జవాబు చెప్తారని పేర్కొన్నారు. 14 ఏళ్లు పోరాడి తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, బీఆర్ఎసను ప్రజలే గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటారన్నారు.

### భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ మంతనాలు

పలువురు ముఖ్య నేతలు పార్టీని వీడుతున్న వేళ భవిష్యత్తు కార్యాచరణపై బీఆర్ఎస్ అధినేత దృష్టి పెట్టారు. ఈ మేరకు మాజీ మంత్రులు కేసీఆర్, హరీశ్‌రావుతో సమావేశమై సమాలోచన జరిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి కేశవరావు వచ్చి వెళ్లిన తర్వాత గురువారం మధ్యాహ్నం కేటీఆర్, హరీశ్‌రావు అక్కడికి చేరుకుని కేసీఆర్‌తో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. గురువారం రాత్రి పొద్దుపోయే వరకూ వీరి సమావేశం జరిగినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ వెళ్లిన కేటీఆర్ మధ్యాహ్నం తిరిగి వ్యవసాయ క్షేత్రానికి వచ్చారు.

హరీశ్‌రావు కూడా దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని తిరిగి వచ్చారు. అలాగే, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిశారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలపై వీరి మధ్య సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు సమాచారం. నాయకులు పార్టీని వీడినంత మాత్రాన నష్టం ఏమీ లేదని, కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని కేసీఆర్ ఈ సందర్భంగా సూచించినట్లు తెలిసింది.



### స్కామ్‌లన్నింటిలోనూ 'రావు'లే..

## అందరూ జైలుకే

- దేవుడి పేరుతో కాళేశ్వరం నిర్మించి దోచుకున్నారు
- ప్రతిమ శ్రీనివాస్‌కు కాంట్రాక్టు కోసమే మూడో టీఎంసీ
- సచివాలయంలో కేటీఆర్ బావమరుదులకు ఐటీ కాంట్రాక్టు
- ఇంటింటికీ ఇంటర్‌నెట్ పేరుతో రూ.5వేల కోట్ల దోపిడీ
- ఫోన్ ట్యాపింగ్‌ను ఒప్పుకొన్న కేటీఆర్‌పై కేసు పెట్టాలి
- మా పార్టీలోకి గేట్లు పగలగొట్టుకుని మరీ వస్తున్నారు
- ఇంకా 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు
- దానం నాగేందర్ అభ్యర్థిత్వంపై సమస్యలు రావచ్చు
- త్వరలో సినిమా థియేటర్లపై రైడ్స్: మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 29 (వెలుతురు):** కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలే ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకున్నాయని ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి కరువు కూడా కేసీఆర్ పాపాల వల్లనే వచ్చిందన్నారు. యాదగిరిగుట్ట పేరును యాదాద్రిగా మార్చడం కేసీఆర్ చేసిన మొదటి తప్పు అని, కాళేశ్వరం ప్రాజెక్టుకు దేవుడి పేరు పెట్టి.. దోచుకోవడంతోపాటు సర్వనాశనం చేశారని ఆరోపించారు. జిల్లాలు, గ్రామాల్లో నీరు లేక పంటలు ఎండిపోతుంటే చూడలేక తన కళ్లు చెమ్మగిల్లుతున్నాయని తెలిపారు. 2004 నుంచి 2014వరకు రాష్ట్రంలో వర్షాలు బాగా కురిశాయని, ఒకానొక సమయంలో కాంగ్రెస్ అంటేనే వర్షం, వర్షం అంటే కాంగ్రెస్ అనే ప్రచారం జరిగిందని, వైఎస్సార్ కూడా ఇదే మాట అనేవారని గుర్తు చేశారు. ఈ శుక్రవారం మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో కోమటిరెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఏ శాఖలో చూసినా స్కామ్‌లే ఉన్నాయని, అన్నింటిలోనూ 'రావు'లే ఉన్నారని అన్నారు. ఫోన్‌ట్యాపింగ్ చేశామని కేటీఆరే తన వ్యాఖ్యల ద్వారా ఒప్పుకొన్నారని, ఆయనపై కేసు నమోదు చేయాలన్నారు. ట్యాపింగ్ రుజువైతే పదేళ్ల వరకు జైలుశిక్ష పడుతుందన్నారు. సినిమా ఇండస్ట్రీలోనూ ట్యాపింగ్ చేశారని, అయితే సినీ పరిశ్రమ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని తెలిపారు. కాగా, సచివాలయంలో ఐటీ పేరుతో కేటీఆర్ బావమరిదికి ఇచ్చిన కాంట్రాక్టు, నిర్వహించిన పనితోపాటు ఇంటింటికీ ఇంటర్‌నెట్ పేరుతో రూ.5వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ రెండింటిపై విచారణ చేయిస్తామన్నారు. ప్రతిమ శ్రీనివాసకు రూ.20వేల కోట్ల కాంట్రాక్టు అప్పగించేందుకే కాళేశ్వరం మూడో టీఎంసీ పనులు చేపట్టారని అన్నారు.

మిగతా..2లో



GeneralNEWS



# సిఎం రేవంత్ రెడ్డితో కెకె భేటీ

- కాంగ్రెస్‌లో చేరికపై ఇరు నేతల చర్చలు
- తన పుట్టిల్లు కాంగ్రెస్ అంటూ కేశవరావు వ్యాఖ్య

హైదరాబాద్,మార్చి29 (వెలుతురు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు భేటీ అయ్యారు. డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన కేకే.. ముఖ్యమంత్రితో పార్టీ చేరికకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. తాను బీఆర్ఎస్ నుంచి సొంతగూటికి చేరుతున్నట్లు కెకె ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఆయన కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఇటీవల వారితో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి తిరిగిరావాలని ఆహ్వానించారని చెప్పారు. దీంతో 84 ఏండ్ల వయసులో తిరిగి సొంత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన తనకు కూడా కలిగిందని కేకే అన్నారు. బీఆర్ఎస్‌లో తనకు సముచిత గౌరవం దక్కిందని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా తనను బాగా చూసుకున్నారని అన్నారు. తాను, తన కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నామని చెప్పారు. తన కుమారుడు విప్లవ్ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పాడని వెల్లడించారు. కేకే నిన్న బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. చనిపోయే వరకూ కాంగ్రెస్ లోనే ఉంటానని కేకే తెలిపారు. రేపు ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కేకే కాంగ్రెస్ పార్టీలో చేరనుండటంతో ఒక్కసారిగా రాష్ట్రంలో కలకలం ప్రారంభమైంది. ముందుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరతారని.. ఆమె చేరిన తర్వాత కేకే పార్టీ మారే అవకాశం ఉందంటూ తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆమె కంటే ముందుగానే రేవంత్‌తో కేకే భేటీ అవడం గమనార్హం. కాంగ్రెస్‌లో చేరడంపై కేశవరావు తాజాగా ప్రకటన చేశారు. కాంగ్రెస్ తనకు సొంత ఇల్లులాంటిదని చెప్పారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారని.. తాను కూడా తన సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరుతానని స్పష్టం చేశారు. 53ఏళ్లు కాంగ్రెస్‌లో పని చేశానని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను పని చేసింది కేవలం పదేళ్లు మాత్రమేనని తెలిపారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చిందన్నారు. తాను మొదటిసారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యానని కేశవరావు తేల్చిచెప్పారు. తాను పుట్టింది, పెరిగింది, కాంగ్రెస్‌లోనేనని... ఆ పార్టీలోనే చనిపోవాలని అనుకుంటున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదన్నారు. తన కూతురు కాంగ్రెస్‌లో చేరిన రోజు.. తాను ఆ పార్టీలో చేరట్లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరే తేదీ ఖరారు అయిన తర్వాత తానే చెబుతానని అన్నారు. తన కుమారుడు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉండాలని అనుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేశవరావు స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్‌కు గోడదెబ్బ..చెంపదెబ్బ

- ఇద్దరు సీనియర్లు పార్టీ వీడడంతో షాక్
- కెకె, కడియం కుటుంబం దెబ్బతో నిస్పృహ
- రాజకీయ బేహారులంటూ మండిపడ్డ కెటిఆర్
- కొత్తతరం నాయకత్వాన్ని తయారు చేస్తామని ప్రకటన

హైదరాబాద్,మార్చి29 (వెలుతురు): అధికార పార్టీ విసురుతున్న వలలో బిఆర్ఎస్ చేపలు చేరబోతున్నారు. ఈ క్రమంలో ఇంతపెద్ద ధక్కా బిఆర్ఎస్‌కు తగులుతుందని ఎవరూ ఊహించి ఉండరు. కాంగ్రెస్ ఆహ్వానం మేరకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరనున్నారు. తన కూతురు కావ్య సహా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. వరంగల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది.





పడుతూనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం ఇవే రాజకీయాలు నడుస్తున్నాయి. గతంలో కెసిఆర్ విసిరిన వలనే ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి విసురుతున్నారు. తాజాగా తెలంగాణ రాజకీయాలు అనూహ్య పరిణామాల దిశగా నడుస్తున్నాయి. ఎవరూ ఊహించని విధంగా కేశవరావు, అయన కుమార్తె మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఆయన కుమార్తె డాక్టర్ కావ్య కాంగ్రెస్‌లో కాంగ్రెస్‌లో కడియం చేరికతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. కడియం శ్రీహరి బీఆర్ఎస్ ను వీడటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ పార్టీకి గట్టి దెబ్బే తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధిష్టానం.. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి కోసం అన్వేషణ చేస్తోంది. ఈ క్రమంలో మాజీమంత్రి, నటుడు బాబూ మోహన్‌కు కెసిఆర్ ఫోన్ చేసి ఆహ్వానించినట్లు సమాచారం.



# మరో ఇద్దరు ఎంపీ అభ్యర్థులూ జంప్?

- ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులు కాంగ్రెస్‌లో చేరిక
- పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలూ హస్తం గూటికి?
- చట్టపరంగా ఇబ్బంది ఉండని సంఖ్యలోనే!
- పార్లమెంటు ఎన్నికల్లోపే వస్తారంటున్న కాంగ్రెస్
- నేతలు దిగిపోతుండడంతో ఖాళీ అవుతున్న 'కారు'

హైదరాబాద్, మార్చి 29 (వెలుతురు): పార్లమెంటు ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థులుగా ప్రకటించిన మరో ఇద్దరు నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నారా? హస్తం పార్టీలోకి వెళ్లి అక్కడి నుంచి ఎన్నికల బరిలో నిలవనున్నారా? అంటే.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ఇప్పటికే చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన రంజిత్‌రెడ్డి కాంగ్రెసలో చేరగా, తాజాగా వరంగల్ అభ్యర్థి కడియం కావ్య కూడా గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. హస్తం గూటికి చేరేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. వీరు బీఆర్ఎస్ అభ్యర్థిత్వాలను వదులుకుని పార్టీని వీడడం, వీరినే కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థులుగా నిలుపుతుండడంతో ఇంకా ఎవరెవరు వెళతారోనన్న ఆందోళన గులాబీ శిబిరంలో మొదలైంది. వాస్తవానికి గత ఎన్నికల వరకు బీఆర్ఎస్ టికెట్ తమకు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలంటూ తీవ్ర పోటీ ఉండేది. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలై.. అధికారం కోల్పోయేసరికి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా నేతలెవరూ స్వతంత్రంగా, సంతోషంగా ముందుకురాని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవేళ ఎవరికైనా టికెట్ ఇచ్చినా నామినేషన్ వేసేవరకు పార్టీతోనే ఉంటా రన్న నమ్మకమూ లేకుండా పోయింది. పార్టీ తరఫున ప్రకటించిన అభ్యర్థులే కాంగ్రెసలోకి జంప్ అవుతుండడంతో బీఆర్ఎస్ నాయకత్వం ఆందోళన చెందుతోంది. ఎంపీ అభ్యర్థులే కాకుండా.. పార్టీ సీనియర్ నేతలు, గతంలో మంత్రులుగా పనిచేసినవారు,

సిటింగ్ ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. తాజాగా కె.కేశవరావు, కడియం శ్రీహరి కూడా పార్టీ మారడం ఖాయమైంది. అయితే వీరు బహిరంగంగా పార్టీ మారుతుండగా.. లోలోపల ఇంతకంటే పెద్ద వ్యవహారమే జరుగు తోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ వర్గాల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. రాబోయే కొద్దిరోజుల్లో భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్టు తెలుస్తోంది. పార్టీ మారితే చట్టపరంగా ఇబ్బందిలేని సంఖ్యలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెసలో చేరతారని చెప్పకనే చెబుతున్నారు.

తమతో 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డితో సహా పలువురు మంత్రులు కూడా చెబుతున్న విషయం తెలిసిందే.

# బీఆర్ఎస్ అవినీతిపై చర్యలేవీ?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో చిత్తశుద్ధి లేదు
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి
- రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ: కిషన్‌రెడ్డి
- సిరిసిల్ల నేతన్నలను ఆదుకో



హైదరాబాద్, మార్చి 29 (వెలుతురు): అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ నాయకుల అవినీతిపై విచారణ చేయిస్తామని, వారి సంగతి చూస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీ వారిని బెదిరించి కాంగ్రెసలో చేర్చుకుంటున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజ మెత్తారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని తుకారాం గేట్‌లో ఏర్పాటు చేసిన కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో, మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ అయిందని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలిస్తే.. ఏ పార్టీ వైపు వెళతారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో వాటిని అమలు చేసే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెసకు ఓటేసిన పాపానికి ప్రజలపై రాహుల్ గాంధీ టాక్స్ వేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం, నల్లగొండలోనూ బీజేపీకి సానుకూల వాతావరణం ఉందని తెలిపారు.

హైదరాబాద్ ఎంపీ సీటును కూడా బీజేపీ కైవసం చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలి: సంజయ్

సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో నాలుగు నెలలుగా కార్మికులు, యజమానులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.270 కోట్లు చెల్లించలేదని, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఫలితంగా వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన దాదాపు 20 వేల మంది కార్మికులు పనుల్లేక పస్తులు ఉంటున్నారని, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. బకాయిలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. పవర్‌లూం కారా?నాలకు 24 ఏళ్ల నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను నిలిపివేయడంతో రెట్టింపు కరెంటు బిల్లులు వస్తున్నాయని తెలిపారు. విద్యుత్ బకాయిలను మాఫీ చేయడంతోపాటు సబ్సిడీని కొనసాగించాలని కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన పది శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.370 కోట్లతో ప్రవేశపెట్టిన వర్కర్ టూ ఓనర్ పథకం నిలిచిపోయిందని, దానిని ప్రారంభించాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో మొదట జైలుకు వెళ్లాల్సింది హరీశ్‌రావే: రఘునందన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదట జైలుకు వెళ్లాల్సింది హరీశ్‌రావేనని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్‌లోని జంబికుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్ అని అన్నారు. రంజిత్ రెడ్డి నుంచి కడియం కావ్య వరకు బీఆర్ఎసను వీడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అనేక అక్రమాలు చేశారని ధ్వజమెత్తారు. ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేసినోళ్లు సేవ చేస్తామని వస్తున్నారని.. మెదక్ ప్రజలు ఆలోచించాలని కోరారు.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు

# 14 రోజుల రిమాండ్

హైదరాబాద్,మార్చి29 (వెలుతురు): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు అధికారులను అరెస్ట్ చేయగా.. తాజాగా అరెస్టైన మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా, ఉద్యోగ విరమణ తర్వాత అక్కడే ఓఎస్డీగా సుదీర్ఘకాలం పనిచేసిన రాధాకిషన్ రావును ఫోన్ ట్యాపింగ్ కేసులో అదుపులోకి తీసకోగా.. ఆయనను కొంపల్లిలోని న్యాయమూర్తి నివాసంలో ప్రవేశపెట్టారు. ఆయనకు 14రోజుల రిమాండ్‌ను న్యాయమూర్తి విధించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో పని చేసిన సమయంలో సస్పెండ్‌కు గురైన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాధాకిషన్‌రావు బృందం అనధికారికంగా ఫోన్లు ట్యాప్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి బంజారాహిల్స్ స్టేషన్‌లో రాధాకిషన్‌రావును విచారించిన దర్యాప్తు బృందం శుక్రవారం ఆయనను అరెస్ట్ చూపించింది. దీంతో గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ముందు ఆయనను పోలీసులు ప్రవేశ పెట్టారు. జడ్జి రిమాండ్ విధించడంతో రాధాకిషన్‌రావును



చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న అరెస్ట్ కాగా.. వారిద్దరు ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా వారిద్దరికి ఏప్రిల్ 2వరకు కోర్టు పోలీస్ కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో కీలకంగా ఉన్న మరో నిందితుడు ప్రణీత్‌రావును కస్టడీకి ఇచ్చేందుకు మాత్రం కోర్టు నిరాకరించింది.

# మాపై సోషల్ మీడియాలో అవాస్తవాలు

**మేం బిఆర్ఎస్ పార్టీని వీడేది లేదు**

**మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టీకరణ**



హైదరాబాద్,మార్చి29(వెలుతురు): ఇవాళ సోషల్ మీడియా ఫ్రీగా ఉంది కాబట్టి ఇష్టమొచ్చినట్లు పుకార్లు సృష్టిస్తున్నారు.. వాళ్లు పార్టీ మారుతున్నారు.. వీళ్లు పార్టీ మారుతున్నారు అని రూమర్స్ వ్యాప్తి చేస్తున్నారు అని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మా జిల్లాలో నా కోసం ఒక మంత్రి పదవికి రిజర్వ్ చేసి పెట్టారట. నా కుమారుడు కార్తీక్ రెడ్డి చెప్పిన మాదిరిగా చివరి శ్వాస వరకు కేసీఆర్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో సబిత పాల్గొని ప్రసంగించారు. తోటి ఎమ్మెల్యేలు చేవెళ్ల చెలెమ్మ అన్నప్పుడల్లా నా మనసు పులకరించిపోతోంది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం. గత 20 ఏండ్ల నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. ప్రతిపక్షంలో ఉండి ఎలా పోరాటం చేయాలో మీకు అందరికీ తెలుసు. ప్రజల కోసం పని చేయాలి. ఈ ఎన్నికల్లో మన పార్లమెంట్ ఏరియాలో ఏమన్న ఇబ్బంది ఉంటే చెప్పండి.. పరుగెత్తుకువస్తాం. కేసులకు భయపడేది లేదు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న తట్టు తాకింది.. దాంతో వెనక్కి వెళ్లాల్సిన అసవరం లేదు. గట్టిగా పని చేసి కాసానిని గెలిపించి, కేసీఆర్ రుణం తీర్చుకుందాం. విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి ఎవరో మనకు తెలియకపోయినా కేసీఆర్ పంపించారు.. మనం గెలిపించాం. అంతో ఇంతో కాసాని మనతో మమేకమై పని చేస్తూ వస్తున్నారు. ఈ రోజు బడుగుల గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే ఆయనను గెలిపించాలి. కార్యకర్తల శక్తి ఏంటో ఇప్పుడు చూపించాలి. కేసీఆర్ అంటే ఏంటి..? కేసీఆర్ సైన్యం ఏంటో చూపించాలి. మాకు వచ్చిన మెజార్టీ కంటే కాసానికి డబుల్ మెజార్టీ రావాలి. ఇవాళ పార్టీ మారుతున్న వారంతా మానవత్వం లేని వారు అని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్ నుంచి చెత్త వీడుతోంది

**పదవులకోసమే గతంలో పార్టీలో చేరారు**

**మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే**

**మండిపడ్డ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

**పార్టీ వీడిని వారికి కర్రుకాల్చి వాతపెడతారన్న దాసోజు**

హైదరాబాద్,మార్చి29(వెలుతురు): బీఆర్ఎస్ పార్టీని వీడి పలువురు ఇతర పార్టీల్లో చేరడంపై మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి చెత్తాఅంతా పోయింది. గట్టి వాళ్లు మాత్రమే మిగిలారని పేర్కొన్నారు. పదవులు, వ్యాపారాల కోసం వచ్చిన వారే పార్టీ మారుతున్నారని విమర్శించారు. మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే ఉంటుందన్నారు. తొలినుంచి గులాబీ జెండా మోసిన నాయకులే పార్టీలో ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల తర్వాత బండ్లు ఓడలు, ఓడలు బండ్లవుతాయని చెప్పారు. ఎవరు పార్టీని వీడిన వచ్చే నష్టం లేదన్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ పార్టీకి సీనియర్లు రాజీనామా చేసి వెళ్లడం పట్ల దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లం దగ్గరకు ఈగలు పోయినట్టుగా.. నీళ్లు వస్తే కప్పలు చేరినట్టుగా ఇవాళ అధికారంలోకి రావడంతో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని వదిలేసి కాంగ్రెస్ మత్తడిలోకి దూకుతున్నారని చెప్పారు. పార్టీని వీడుతున్న సమయంలో వాళ్లందరూ ఆత్మగౌరవం గురించి మాట్లాడటం బాధగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నాడు కే కేశవరావు కుమారుడు విప్లవ్ కుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నన్ని రోజులు వీళ్ళెవరికీ ఆత్మగౌరవం గుర్తు రాలేదని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అధికారం పోయిన మూణ్నెళ్లలోనే చాలామంది నేతలు ఆగమాగమవుతూ సాకులు చెబుతూ పార్టీని వీడుతున్నారని అన్నారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నదని.. అపాయింట్‌మెంట్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీపై దాడి చేసేందుకు దుర్మార్గపు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గ కార్లలో తిరిగి.. పదేండ్లు అధికారంతో వచ్చిన హోదా, డబ్బు, అధికారాన్ని అన్ని రకాలుగా వాడుకుని దాటవేత ధోరణికి పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా ఆత్మగౌరవం అంశాన్ని లేవనెత్తని మీరు.. అధికారం పోగానే ఆత్మగౌరవం అనే ప్రశ్న పట్టుకురావడం ఎంతవరకు సమంజసమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ఇది వాళ్ల అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. దివాంచీ బార్ దగ్గర బీడీలు అమ్ముకునేటోడు అని దానం నాగేందర్‌ను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అంతకంటే ఆత్మగౌరవాన్ని కించపరిచే కామెంట్ ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. బీడీలు అమ్ముకునేందుకు కూడా పనికిరాడు అంటూ అవమానించి.. ఆత్మన్యూనత భావంలోకి నెట్టివేసిన రేవంత్ రెడ్డి పంచన చేరే ప్రయత్నం చేసేటప్పుడు ఆత్మగౌరవం గుర్తురావడం లేదా? అని ప్రశ్నించారు.

' ఒక్కనాడు కూడా కేటీఆర్ నిన్ను బీడీలు అమ్ముకునేటోడు అని అనలేదే.. కేటీఆర్ ఎప్పుడూ నీ భూకబ్జాల గురించి మాట్లాడలేదే.. కేటీఆర్ ఒక్కనాడు కూడా ఏరకంగా అగౌరవపరచినట్టు కనబడలేదే.. కేసీఆర్ అయితే కన్నకొడుకు లెక్క చూసుకున్నడు.. అందుకే కేసీఆర్ నాకు దేవుడు లాంటి వాడు అని నువ్వే అంటుంటవ్.. చుట్టూ ఉన్నవాళ్ల కోసం దేవుడిని వదిలేస్తావా? దేవుడి కోసం దేవుడి దగ్గర ఉంటావా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు

బీఆర్ఎస్‌లోకి వచ్చారు.. బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు.. ఇంతకంటే నీచమైన అవకాశవాద రాజకీయం ఇంకోటి ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. కన్నతండ్రిలా వ్యవహరించిన కేసీఆర్‌కు



వెన్నుపోటు పొడిచి పార్టీ వీడటం ఎంతవరకు న్యాయమో నాగేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్

వైఎస్సార్ కూడా కాళ్లు మొక్కలేదు.. కానీ అనేకసార్లు కేసీఆర్ కాళ్లు మొక్కిండు.. మరి నిజంగానే కేసీఆర్ అవమాన పరిచేలా వ్యవహరించి ఉంటే.. ఆయన కాళ్లు మొక్కేవాడా? అని ప్రశ్నించారు.

దానం నాగేందర్‌తో పాటు కే కేశవరావు, కడియం శ్రీహరిపైనా దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వదిలివెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఏ మాత్రం ఇంగితం ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని డిమాండ్ చేశారు. మీకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమైన దానం నాగేందర్‌పై కూడా దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అసలు ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఒక దాంట్లో ఓడిపోయినా.. మరొకటి ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు ఉన్నారని అన్నారు.

ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై దానికి రాజీనామా చేయకుండా.. మరో పార్టీ నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే ఆటోమేటిగ్గా అనర్హత వేటు పడుతుందని తెలియజేశారు. ఒకేసారి రెండు పడవల మీద ప్రయాణం చేయాలని అనుకుంటున్నారు.. కానీ రెండింట్లోనూ మునక తప్పదని ఆయన విమర్శించారు. ఖైరతాబాద్ ప్రజలు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు.



## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్‌ని కలిసిన టిపిసిసి కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్

హైదరాబాద్ వెలుతురు మార్చి 29:
శుక్రవారం రోజున గాంధీ భవన్ లో ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారితో కలిసి తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన టిపిసిసి కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


BHARATIYA JANATA PARTY
Central Office
6 A, Pandit Deen Dayal Upadhyaya Marg,New Delhi - 110002
Date - 29/03/2024
Mobile 9676854470
Donated INR 500 on 29/03/2024 12:59:18 pm
Cause For Donation: Party Fund
Amount INR 500
Donations to the Party are exempt from Income Tax u/s 80GGB for Companies and u/s 80 GGC for Others as per Income Tax Act, 1961
PAN No.: AAABB0157F
Regn. No.: 56/R/1/89 Dt. 19 Sept. 1989



సంగారెడ్డి జిల్లా వెలుతురు మార్చి 29:
భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి నా వంతు బాధ్యతగా 500రూపాయలు పార్టీ ఫండ్ ఇవ్వడం జరిగింది. సంగారెడ్డి జిల్లా బిజెపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బండారి మీనాక్షి గౌడ్

## బిజెపి నమో అప్ మైక్రో డొనేషన్ క్యాంపెయిన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బండారి మీనాక్షి గౌడ్

సంగారెడ్డి వెలుతురు మార్చి 29:
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి గారి పిలుపుమేరకు శుక్రవారం రోజున





సంగారెడ్డి నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి గారి ఆధ్వర్యంలో హౌ మెనీ మైక్రో డొనేషన్ క్యాంపస్ లాంచింగ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బండారి మీనాక్షి గౌడ్ మరియు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు శక్తి కేంద్రం ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు

## పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ నిర్మాణం కోసం శంకుస్థాపన మహొత్సవం

### ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి

### తుర్కయంజాల్ మున్సిపాలిటీ
### కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్

ఇబ్రహీంపట్నం, (వెలుతురు న్యూస్):
ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్టపైన శ్రీ హరివర ఆఖండ క్షేత్రంలో 108 అడుగుల శ్రీ.. పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ నిర్మాణం కోసం శంకుస్థాపన మహొత్సవ కార్యక్రమం నేడు 30-03-2024 ఉదయం 9:44 ని లకు జరుగుతుంది ఇట్టి కార్యక్రమానికి గౌరవ..రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు గారు, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారు విచ్చేయుచున్న శుభ సందర్భంగా ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, మున్సిపాలిటీల నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు మరియు ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనది

## పెండింగ్ వేతనాల కోసం ఆదోంళన

### పాల్వంచ ఆస్పత్రి ముందు ధర్నా

పాల్వంచ,మార్చి29(వెలుతురు న్యూస్): ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ దవాఖానలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు హాస్పిటల్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పుడు కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ప్రతి నెల వేతనాలు వచ్చేలా చూడా లన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన వేతనాలు ఇవ్వక పోతే సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి అధికారులకు నోటీసు అందజేశారు.



### ఎట్టకేలకు బీజేపీ పార్టీ, ఎంపీ సోయం బాపురావ్‌ల మధ్య

# కుదిరిన సయోధ్య

**హైకమాండ్ భరోసాతో ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గెలుపు కోసం పనిచేస్తానని హైకమాండ్‌కు తెలియజేసిన ఎంపీ సోయం బాపురావ్ ..**

**భవిష్యత్తులో సోయం బాపురావ్ కు జాతీయ స్థాయిలో గౌరవ స్థానాన్ని కేటాయిస్తామని సోయం బాపురావ్ కు హైకమాండ్ భరోసా ..**

**రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, జాతీయ కార్యదర్శులు సునీల్ బస్వాల్ మరియు తరుణ్ చుగ్ నిర్దేశకంలో మధ్యవర్తిగా పనిచేసిన కిన్వట్ ఎమ్మెల్యే కేరం భీంరావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ ముస్తాపురే..**

న్యూఢిల్లీ, వెలుతురు మార్చి 29:
అదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు టికెట్ కేటాయించిన తరువాత అసహనానికి లోనైన ఆశావాహులను బుజ్జగించే ప్రయత్నంలో దిగింది బీజేపీ హైకమాండ్.. ఇందులో భాగంగా ఇప్పటికీ ఆశావాహులైన రాథోడ్ రమేష్, రాథోడ్ జనార్ధన్, రాజేష్ బాబు లను స్వయంగా కలిసి చర్చలు జరిపి సఫలీకృతమయ్యారు గోడం నగేష్.. అయితే తనను కాకుండా బీఆర్ఎస్ నుండి పార్టీలో చేరిన గోడం నగేష్‌కు టికెట్ ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న సోయం బాపురావ్ ఏకంగా రెబల్ గా పోటీచేస్తానని ప్రకటించడంతో పార్టీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.. అయితే అదిలాబాద్ పార్లమెంట్ స్థాయిలో ఏర్పడ్డ గందరగోళానికి ముంగింపు పలికేందుకు రాష్ట్ర అగ్ర నాయకత్వం రంగంలోకి దిగింది... నిన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి నేతృత్వంలో జాతీయ కార్యదర్శులు సునిల్ భన్సాల్ మరియు తరుణ్ చుగ్ ఆధ్వర్యంలో అదిలాబాద్ వివాదాన్ని సద్దుమనిగిపించే దిశగా సోయం బాపురావ్ కు అతి సన్నిహితులైనా మహరాష్ట్ర లోని కిన్వట్ ఎమ్మెల్యే కేరం



భీంరావ్ మరియు అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన నాయకుడు అయినా అశోక్ ముస్తాపురే గార్లతో పలు దఫాలు చర్చలు జరిపి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డ గారితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.. శుక్రవారం రోజున ఢిల్లీ లోని బీజేపీ జాతీయ కార్యాలయంలో సోయం బాపురావ్ తో కిన్వట్ ఎమ్మెల్యే కేరం భీంరావ్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ ముస్తాపురే గారితో సమావేశమయినా సోయం బాపురావ్ కు పార్టీ తరుపున నిర్దిష్టమైన స్థానాన్ని కల్పించడమే కాకుండా భవిష్యత్తులో జాతీయ స్థాయి లో నామినేట్ పోస్టును కల్పించే హామిని హైకమాండ్ ఖచ్చితంగా చెప్పడంతో సోయం బాపురావ్ అలక మానారు.. పార్లమెంట్ ఎన్నికలలో ఎట్టకేలకు గోడం నగేష్ కు మద్దతుగా ప్రచారం చేసి గెలిపించే బాధ్యతను భుజాలపై తీసుకున్నారు సోయం బాపురావ్.. అదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఆశించిన బీజేపీ నాయకులందరూ గోడం నగేష్ కొరకు పనిచేసేందుకు సమాయత్తం కావడంతో అదిలాబాద్ బీజేపీ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎట్టకేలకు కొలిక్కి వచ్చాయి... దీంతో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గెలుపు దాదాపు ఖాయంగా మారింది.. ఇక ఈ సయోధ్యకు కీలకంగా పని చేసిన కిన్వట్ ఎమ్మెల్యే కేరమ్ భీంరావ్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ ముస్తాపురే గారిని పార్టీ హైకమాండ్ అభినందించింది.. అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో పనిచేసే ఏ ఒక్క ప్రధాన నాయకులను పార్టీ మరువకుండ తప్పకుండా సముచిత స్థానాన్ని కేటాయిస్తుందని పార్టీ హైకమాండ్ హామి ఇచ్చింది.. ఇక ప్రస్తుత అదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ కు జాతీయ స్థాయిలో కేబినెట్ స్థాయి నామినేట్ పదవి దొరకున్న నేపథ్యంలో సోయం బాపురావ్ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొంది..

## తమ గెలుపుకు సహకరించిన తుంకుంట నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావులను సన్మానించిన తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతీ కృష్ణ, కౌన్సిలర్లు

వెలుతురు తూప్రాన్, మార్చి, 29:
తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ గా శ్రీమతి మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు ల గెలుపు కోసం విశేష కృషి చేసిన సిద్దిపేట డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంఛార్జి, మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు లను శుక్రవారం మర్యాద పూర్వకంగా కౌన్సిలర్ లతో కలిసి ఘనంగా సన్మానించి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ పై అవిశ్వాసం పెట్టిన తరవాత నెగ్గడానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్త%శీ%రెడ్డి నీ ఓటింగ్ లో పాల్గొనేలా కృషి చేసిన మైనంపల్లి హన్మంతరావు అన్న గారికి, క్యాంప్ కు తరలించి విజయవంతంగా కార్యధిక్షతతో పట్టుదలతో ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, కుట్రలు పన్నినా అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని స్థిరమైన మనస్తత్వంతో తనదైన శైలిలో ఎన్నో రకాల వ్యయ



ప్రయాసలకోర్చి మున్సిపల్ ఎన్నికలు లలో సంపూర్ణ మద్దతు ఇచ్చి మున్సిపల్ పీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా చేయూత అందించిన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు మర్యాద పూర్వకంగా కలిసి వారిని మనస్ఫూర్తిగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు రామునిగారి శ్రీశైలంగౌడ్, జిన్నా భగవాన్ రెడ్డి, కోడిప్యాక నారాయణ గుప్త, పల్లెర్ల రవీందర్ గుప్త, బానాపురం రాజు, ఫ్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి, మనోహరబాద్ తాజా మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, నాగులపల్లి తాజా మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం..

## బిఆర్ఎస్‌కు పొగపెడుతున్న రాజకీయాలు!

రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్షణ ఎక్కువ. సిద్దాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని బేరీజు వేసుకుంటున్నారు. కెసిఆర్ నేర్పిన సిద్దాంతం ఇది. ఆయన నేర్పిన సిద్దాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యే నను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ ముద్ర వేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలుచెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం...ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా..ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్ధం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. కానీ ప్రచారంలోనే అభివృద్ధిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్వి నియోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్ అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. బిఆర్ఎస్ విషయంలో ఇదే జరిగింది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈ కాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి కెసిఆర్ ..కేవలం కుటుంబ పాలనకు తెరతీసారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్రంగా ప్రభావం చూపింది. అందుకే కాంగ్రెస్, బిజెపలను లక్ష్యంగా చేసుకుని వారి విమర్శలను గట్టిగా తిప్పికొట్టినా ప్రజలు నమ్మడం లేదు. అందుకే నేతలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. లేదా బిజెపిలో చేరుతున్నారు. ఈ రెండు పార్టీల క్ష్యం ఒక్కటే. బిఆర్ఎస్‌ను దెబ్బతీయడం. దీనిని దెబ్బతీసినా ప్రజల్లో సానుభూతి లేదు. అయ్యో కెసిఆర్ అని ఏ ఒక్కరూ అనడం లేదు. ఎందుకంటే స్వయంకృతం తప్ప మరోటి కాదు. ప్రజల్లో సానుభూతి లేకుండా చేసుకున్న పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం బిఆర్ఎస్ మాత్రమే. గతంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న పార్టీలన్నీ మళ్లీ ప్రజల్లో నిలవగలిగాయి.

అందుకు టిడిపి, కాంగ్రెస్, బిజెపిలను చూస్తే తెలుస్తుంది. ఇకపోతే కెసిఆర్ వద్ద అధికారం ఉన్నా ఇంతకాలం నేతలు అణగిమణిగి ఉన్నారు. అధికార పార్టీలో ఉండాలన్న లక్ష్యంతో ఉన్నారు. ప్రజల సమస్యలను, ప్రజాప్రతినిధుల నుంచి తెలుసుకునే ప్రయత్నం ఏనాడూ కుటుంబ సభ్యులు చేయలేదు. అందుకే అధికారం పోవడంతో కెసిఆర్ రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. దానం నాగేందర్ కావచ్చు...కెకె కుటుంబం కావచ్చు..కడియం కుటుంబం కావచ్చు.. అందరిదీ ఒకటే అనుభవం. ఇందులో ఓ మంచి ప్రయత్నం ఏమంటే కెకె నేరుగా కెసిఆర్‌ను కలసి పార్టీ మారే విషయం చెప్పారు. ఆయన నిజంగానే అభినందనీయుడు. ఈ క్రమంలోనే తెలంగాణలో వలసల రాజకీయం తారాస్థాయిలో ఉంది. అధికార పార్టీలోకి ప్రతిపక్షాల నాయకులు ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులు జంప్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పరిణామాలు గులాబీ పార్టీ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఓ స్థాయి నేతలు వెళ్లడం వేరు... ఇప్పుడు ఏకంగా లోక్‌సభ బరిలో ఉన్న నేతలు వెళ్లిపోవడం మింగుడుపడటం లేదు. కేకే, ఆయన కుమార్తె, కడియం ఆయన కుమార్తె కావ్యలు మూకుమ్మడిగా మరికొందరితో కలిసి చేయి అందుకోవడం తట్టుకోలేక పోతున్నారు. ఇదంతా ఎందుకు జరుగుతుందన్న ఆత్మవిమర్శలు చేసుకోకుండా విమర్శలకు దిగడం ద్వారా బిఆర్ఎస్ మరితం పలుచన అవుతోంది. శూన్యం నుంచే సునామీ సృష్టించిన కేసీఆర్ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు బెదిరిపోతారా అంటు కెటిఆర్ ప్రశ్నించడం చూస్తే ఆయన ఎంత అవివేకి అన్నది తెలుస్తుంది. రాజకీయాల్లో మన సమయం వచ్చినప్పుడే అడుగులు వేయాలి. వేసిన అడుగులు బలంగా ఉన్నాయా లేదా అన్న విచోణ చేయాలి. లేవంటే అది మన దృష్టి లోపంగా తెలుసుకోవాలి. ఈ నిజాన్ని బిఆర్ఎస్ తెలుసుకుంటే మంచిది.

## కెసిఆర్‌ను వెన్నాడుతున్న కేసులు

అధికారం కోల్పోవడంతో కెసిఆర్ వెంట నడిచిన వారు ఒక్కొక్కరే వీడిపోతున్నారు. కెసిఆర్‌తో ఇంతకాలం ఉన్న బంధాన్ని వారు కేవలం అధికారంతో మాత్రమే ముడి పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు అయినా గెల్చుకుంటేనే బిఆర్ఎస్‌కు ప్రాణం ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న ప్రచారం సాగుతోంది. దీనికితోడు అవినీతి, అక్రమాల కేసుల, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఉచ్చు తగులుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే పార్లమెంటులో విజయంతో మళ్లీ సర్దుకునే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కూడా ఇప్పుడు అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయకున్నా నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలగితే రాజకీయంగా నిలబడతారు. లేకుంటే రాజకీయ సునామిలో కొట్టుకుపోతారు. సెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నది. పదేండ్లు రాష్ట్రాన్నిఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దంన్నర పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడంలో కేసీఆర్, నాటి టీఆరెస్ పాత్ర తక్కువేమీ కాదు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నది. మూడోసారి అనూహ్యంగా పరాజయం పాలయ్యారు. తీవ్రమైన ఓటమి నుంచి ఆ పార్టీ కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్‌గా మారింది. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. తాజాగా కవిత అరెస్టు, జైలు ఆ పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయి. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకుచుట్టుకుంటోంది. ఇలాంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొననగా గోరుచుట్టుపై రోకటిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం ఇబ్బందిగా మారింది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద

సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆరెస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ మంత్రి కడియం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతోందని జోస్యాలు చెప్పడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ మాటలే బీఆరెస్‌కు ఇబ్బందిగా మారాయి. నైతికత అంశాన్ని పక్కకుపెడితే తమ ప్రభుత్వ రక్షణకు ఫిరాయింపులను ప్రోత్సహించక తప్పలేదంటూ గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. తాజాగా నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయ కలవరానికి దారితీసింది. పలువురు సిట్టింగ్ ఎంపీలు కూడా పార్టీని వీడారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.

మెజార్టీ సిట్టింగ్ ఎంపీలు రెండు పార్టీల్లోకి జంప్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ పోరాటం చేస్తున్నారు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆరెస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టింగ్‌లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్ కుమార్‌కు అభ్యర్థికి కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాలు కొత్తవారిని బరిలో దింపారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో కనీస పోటీ లేదని పార్టీ వర్గాల్లోనే చర్చించుకోవడం గమనార్హం. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలూ నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆరెస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపోయారు. తనకు ప్రజాభిమానం ఇంకా మెండుగా ఉందని నిరూపించుకుంటే కొంతకాలం రాజకీయంగా నిలబడతారు. కానీ అక్రమాలు, ఆర్థిక కేసులు మాత్రం వదలవని గుర్తించాలి.

## బీఆర్ఎస్ పార్టీ అంధకారంలోకి వెళ్తుందా.?

# పార్టీ వీడుతున్న ముఖ్య నేతలు...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాట్లు ముఖ్య పాత్ర పోషించిన టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాలు అధికారం చిక్కించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో పథకాలు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు మొదలుపెట్టి.

తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్థాపనే ఏకైక లక్ష్యంగా ఏర్పడింది. 2001 ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) అప్పటి ఆంధ్రప్రదేశ్



శాసనసభ ఉపసభాపతి పదవికి, శాసనసభా సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి వి. ప్రకాశ్ వంటి కొందరు నాయకులతో కలిసి తెరాసను ఏర్పాటు చేశాడు. ఆలె నరేంద్ర, సత్యనారాయణరెడ్డి, లాంటి కొందరు నాయకులు తెరాసను విడిచి వెళ్ళారు. నిజాం మనుమరాలు సలీమా బాషా (అస్మత్ బాషా కుమార్తె), ఆమె కుమార్తె రఫత్‌షా ఆజంపురాలు తెలంగాణకు మద్దతు ప్రకటించారు. పాతబస్తీలోని ముస్లిం వర్గాలు తెలంగాణకు వ్యతిరేకం కాదని అన్నారు.

2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో టీఆర్?ఎస్? పార్టీ పురుడు పోసుకుంది. సుదర్శన్ రావు, నాయిని నర్సింహారెడ్డి, హన్మంతరావు, గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్, నిమ్మ నర్సిం హారెడ్డి, నారాయణరెడ్డి, గొట్టె భూపతి, మందాడి సత్యనారాయణరెడ్డి, హరీశ్ రావు తదితరులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు ఏడాదికిపైగా జలదృశ్యం లోనే టీఆర్ ఎస్ పార్టీ కార్యకలాపాలు సాగాయి. ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర రాజకీయంలో ఈ పార్టీ ముఖ్యపాత్ర పోషించింది.

2001 మే 17న కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో పెను మార్పులకు బీజం వేసింది. జేఎంఎం చీఫ్, అప్పటి జార?ండ్ సీఎం శిబూ సోరెన్ ఈ మీటింగ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. కొన్ని ఘటనల తరువాత తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకలాపాలు నందినగర్, హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసానికి మారాయి. ఆరు నెలల తర్వాత ఎమ్మెల్యే కాలనీలోని మాజీ మంత్రి వేదంతరావు ఇంటికి పార్టీ కార్యాలయాన్ని మార్చారు. 2004లో వైఎస్ ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్? నంబర్? 12లో ప్రస్తుతం తెలంగాణ భవన్? ఉన్న స్థలాన్ని టీఆర్ఎస్‌కు కేటాయించింది. ప్రస్తుతం క్యాంటీన్ నిర్మిస్తున్న స్థలంలో రేకుల షెడ్డు వేసి టీఆర్?ఎస్? పార్టీ ఆఫీసు నిర్మాణాన్ని ప్రారంభించారు. 2006లో తెలంగాణ భవన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పార్టీకి 60లక్షల మంది కార్యకర్తలు ఉన్నారు.

2022 అక్టోబరు 5న నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సమితి సర్వసభ్య సమావేశంలో పార్టీ పేరును భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ తీర్మానించారు. 2022 డిసెంబరు 22న తెలంగాణ శాసనసభ, తెలంగాణ శాసనమండలిలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ను భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గా మారుస్తూ బులెటిన్ జారీ చేసింది. టీఆర్ఎస్ఎల్పీ ఇక నుంచి బీఆర్ఎస్ఎల్పీగా కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

### ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ....

పార్టీకి సైద్ధాంతిక భూమిక కల్పించడం దగ్గర్నుంచి కార్యాచరణను నిర్దేశించడం వరకు, తెలంగాణ సమాజాన్ని, దేశ రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని లోతుగా అధ్యయనం చేసి, అర్థం చేసుకుని, తెలంగాణ ఉద్యమ వ్యూహానికి రూపకల్పన చేశారు. స్ట్రీట్ ఫైట్ స్థానంలో స్టేట్ ఫైట్ ఉండాలని, అందుకు వాహకంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్ ) ని తీర్చిదిద్దారు. అప్పటి తెలంగాణ రాజకీయ పరిస్థితుల్లో అదొక సాహసోపేతమైన సూత్రీకరణ. తెలంగాణ రాష్ట్ర సమితి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు, నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాతో కరీంనగర్‌లో ప్రత్యేక తెలంగాణ ఇస్తామని ప్రకటింపజేయడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం . యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశం చేర్చడంలో టీఆర్ఎస్ విజయం సాధించింది. తెలంగాణకు అనుకూలంగా దాదాపు 36 పార్టీలు లేఖ ఇవ్వడంలో టీఆర్ఎస్ పార్టీ కృషి చేసింది.కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' అంటూ కేసీఆర్ ఆమరణ నిరహార దీక్షకు దిగారు.అతని దీక్షతో తెలంగాణలో ఉద్యమం ఉధృతం అయింది. దీంతో దిగివచ్చిన యూపీఏ2 ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభిస్తామంటూ 2009 డిసెంబరు 9న ఒక ప్రకటన చేసింది. కానీ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో డిసెంబరు 23న ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.తెలంగాణ ఏర్పాటుపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ దశలో టీఆర్ఎస్ మిగిలిన పార్టీలతో కలిసి తెలంగాణ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడింది. పొలిటికల్ జేఏసీ ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్రంపై ఒత్తిడిని తీవ్రం చేసింది. 2010 డిసెంబరు 16న వరంగల్‌లో టీఆర్ఎస్ తలపెట్టిన మహా గర్జనకు 20 లక్షల మంది హాజరయ్యారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక సమర్పణ తరర్వాత 2011 జనవరి నుంచి టీఆర్ఎస్ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. మొత్తం మీద రాష్ట్ర స్థాపనే ధ్యేయంగా పార్టీని స్థాపించిన ఉద్యమ నేత కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణలోని సంఘాలు, విద్యార్థులు, రాజకీయ నేతల సహాయంతో ఉధృతంగా ఉద్యమం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన టీఆర్?ఎస్, ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లను చవిచూసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారింది.

### పరిపాలన స్థితిగతులు

2014 ప్రత్యేక ఎన్నికలు తర్వాత తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేయికి ఉన్న టిఆర్ఎస్ పార్టీ ప్రజల మెప్పు పొందడానికి చాలా తక్కువ సమయమే పట్టింది 2019 ముందస్తు ఎన్నికల్లో విజయం సాధించిన టిఆర్ఎస్ పార్టీ ప్రజల చేర్చుకొరకు ఎన్నో పథకాలు మరెన్నో ప్రయోజనాలు ప్రజల చెంతకే పాలన విధంగా చేసింది కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా టిఆర్ఎస్ పార్టీలో చేరగానే పరిపాలన అనుసున్నంగా వారికి పదవులు కట్టబెట్టి కిందిస్థాయి ఉన్న నాయకులని టిఆర్ఎస్ పార్టీ మరిచింది అలా మితిమీరిన పాలనతో అహంకారంతో ఎన్ని పథకాలు పెట్టినా ఎన్ని ప్రయోజనాలు చేసినా ప్రజలకు ఏ ఒక్కరోజు కూడా కేసీఆర్ ప్రజలతో కలిసి ప్రజలకు దగ్గర కి వచ్చి సమస్యలు వినే పరిస్థితి లేకుండా పోయింది ఎమ్మెల్యేలకు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం ఇలా చాలా జరిగాయి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు అందరూ టిఆర్ఎస్ పార్టీలో చేరగానే ప్రతిపక్షం అనేదే లేకుండా భూస్థాపితం చేస్తామని కేసీఆర్ ఓ విధంగా చేశాడని అప్పటి ప్రతిపక్ష నాయకుల ఒక మీడియా పత్రికలో చెప్పారు కానీ నేడు 2023 ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది పేరు మార్చిన టిఆర్ఎస్ పార్టీ టిఆర్ఎస్ అవతరించి ఎన్నికల్లో కి వెళ్ళింది కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు మార్పు కోసమని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది వచ్చిన తర్వాత 100 రోజులకు ఒక్కొక్కరిగా టిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారు గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ నాయకుల్ని మళ్ళీ కాంగ్రెస్లోకి చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీలో పని చేసిన కిందిస్థాయి నాయకులకు కూడా అప్పుడు ఉన్న అధికారపక్ష పార్టీ ఇప్పుడున్న అధికారపక్ష పార్టీ ఏ విధంగా అయినా న్యాయం చేయగలుగుతుందా పార్టీలు మారగానే పదవులు వస్తున్నాయి కానీ మార్పు రావడం లేదు ఈ సూత్రాన్ని పాటించినప్పుడే ప్రజల్లో పార్టీలకు ఖచ్చితమైన నమ్మకం ఏర్పడుతుంది ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ టిఆర్ఎస్ గా అయ్యిందా? టిఆర్ఎస్ గా అవుతుందా బీఆర్ఎస్ అవుతుందా...?

అంబటి తిరుపతి
వెలుతురు దినపత్రిక స్టేట్ రిపోర్టర్.
9949055604



# 'విషం' తాగుతున్న పల్లె జనం

భూమి మీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. ఇది ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన వరం. ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు నీరు ప్రాణాధారము. తొలి జీవి పుట్టుక నీటితోనే జరిగింది. తాగునీరు అరుదైన వస్తువుగా మారింది. గ్రామాల్లో, పట్టణాల్లో నివసించే కోట్లాది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే ప్రక్రియ సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నాయి పలు దేశాలు. అధిక జనాభా కలిగిన భారత దేశం కూడా స్వచ్ఛమైన తాగు నీరు అందించలేకపోవడంతో అతి పెద్ద సమస్యగా రూపుదాల్చింది. దేశంలోని 80% జనాభా మంచినీళ్ల రూపంలో విషం తాగుతున్నారు.ఆ విషయాన్ని భారత పార్లమెంట్ సాక్షిగా బయటపెట్టారు. దిగ్భ్రాంతి కలిగించేలా రాజ్యసభ చెప్పిన లెక్కల ప్రకారం దాదాపు భారతదేశ జనాభా విషపూరిత మంచినీళ్లు తాగుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోని భూగర్భ జలాల్లో విషపూరిత లోహాలు అధికంగా ఉన్నట్లు వెల్లడించింది.దేశ జనాభాలో 80 శాతానికి పైగా ప్రజలు భూమి నుండి నీటిని పొందుతున్నారు.

భూగర్భ జలాల్లో ప్రమాదకర లోహాలు నిర్దేశిత ప్రమాణాన్ని మించి ఉన్న నీళ్లను తాగుతున్నారని జల్ శక్తి మంత్రిత్వ శాఖ చెబుతోంది. తాగు నీటి వనరులు కలుషితమై ఉన్న నివాస ప్రాంతాల సంఖ్యను రాజ్యసభ బయట పెట్టింది. ఆ నివేదిక ప్రకారం 671 ప్రాంతాలు ఫ్లోరైడ్, 814 ప్రాంతాలు ఆర్సెనిక్, 14,079 ప్రాంతాలు ఇనుము, 9,930 ప్రాంతాలు లవణీయత, 517 ప్రాంతాలు నైట్రేట్, 111 ప్రాంతాలు భారీ లోహాలతో ఉన్న భూగర్భ జలాలు ఉన్నాయని వివరించింది. భూగర్భ జలాల్లోని విషం నగరాల కంటే గ్రామాలలో చాలా తీవ్రంగా ఉంది. గ్రామాల్లో తాగు నీటికి ప్రధాన వనరులు. చేతి పంపులు, బావులు, నదులు లేదా చెరువులు. సాధారణంగా గ్రామాల్లో ఈ నీటిని శుభ్రం చేయడానికి మార్గం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విషపూరితమైన నీటిని తాగాల్సి వస్తోందని రాజ్యసభ వెల్లడించింది. ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను ఆగస్టు 2019 లో ప్రారంభించినట్లు లోక్‌సభకు తెలిపింది. దీని కింద 2024 నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలి. కానీ, ప్రభుత్వం ఇచ్చిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 9.81 కోట్ల కుటుంబాలకే కుళాయి నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇది కాకుండా, అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2021లో ప్రారంభించింది. దీని కింద, వచ్చే 5 సంవత్సరాలలో అంటే 2026 నాటికి అన్ని నగరాలకు కుళాయి నీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని రాజ్యసభ వేదికగా ప్రభుత్వం చెబుతోంది. నీరు రాష్ట్రానికి సంబంధించిన అంశమని, కాబట్టి ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా తెలపడం గమనార్హం. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించింది. ఒక వ్యక్తి ప్రతిరోజూ సగటున 3 లీటర్ల నీరు తాగుతాడని సాధారణంగా నమ్ముతారు. అయితే ప్రభుత్వ పత్రాల ప్రకారం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 2 లీటర్ల నీరు తాగాలి. మీరు ప్రతి రోజూ 2 లీటర్ల నీరు తాగితే, కొంత మొత్తంలో విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. భూగర్భ జలాల్లోని ఆర్సెనిక్, ఇనుము, సీసం, కాడ్మియం, క్రోమియం, యురేనియం



నిర్దేశిత ప్రమాణం కంటే ఎక్కువగా ఉండటం వల్ల మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

అధిక ఆర్సెనిక్ ఉంటే చర్మవ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

అధిక ఇనుము అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి నాడీ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులను సూచిస్తుంది. నీటిలో అధిక మొత్తంలో సీసం మన నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. అధిక స్థాయి కాడ్మియం మూత్రపిండాల వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొత్తం మీద విషపూరిత మంచినీళ్లు తాగుతూ దేశ జనాభా అనారోగ్యానికి గురవుతున్నారు. ఫలితంగా అనారోగ్య భారత్ దిశగా పాలకులు దేశాన్ని తీసుకెళుతున్న పరిస్థితి నెలకొంది. 2030 నాటికి దేశ జనాభాలో 40 శాతం మందికి గొంతు తడుపుకోవడానికి నీళ్లే దొరకని పరిస్థితి వస్తుందని 'కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్ (సిడబ్ల్యుఎంఐ)' రిపోర్ట్ కూడా గతంలో వెల్లడించింది. మూడేళ్ల క్రితం నాటి నివేదిక ప్రకారం నీళ్లకు సంబంధించి దేశం డేంజర్ జోన్‌లో ఉంది. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి సర్కార్ వెంటనే చర్యలు చేపట్టాలని కోరింది.

యుద్ధ ప్రాతిపాదికన వాటర్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయాలని సూచించింది. మంచినీళ్లు దొరక్కపోవడంతో చాలా మంది కలుషిత నీళ్లనే తమకు తెలిసిన పద్ధతిలో శుద్ధి చేసుకుని తాగుతున్నారు. దీంతో ప్రతి ఏడాది రెండు లక్షల మంది కలుషిత నీళ్లు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అడుగంటిపోతున్న భూగర్భ జలాలను సిడబ్ల్యుఎంఐ సీరియస్‌గా తీసుకుంది. అదే విధంగా వ్యవసాయానికి అవసరమైన నీళ్లను పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.



## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరుస్తుంది..

### టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు

### మల్కాజిగిరి ఎంపీ ఎన్నికల బోడుప్పల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి వెలుతురు :**
ఈ రోజు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి గారి ఆధ్వర్యంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి గెలుపు లక్ష్యంగా బోడుప్పల్ కార్పొరేషన్ ముఖ్య కార్యకర్తల



సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు డిపాజిట్ రాకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రధాన కార్యదర్శిలు,కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు,బీసీ సెల్ s.c. సెల్, మైనారిటీ సెల్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ డి గ్రామర్ హై స్కూల్‌లో ఘనంగా ప్రతిబింబ్ థీమ్ డే వేడుకలు...

**ఆల్విన్ కాలనీ, వెలుతురు:** ఆల్విన్ కాలనీలోని ఎస్ ఎస్ డి గ్రామర్ హై స్కూల్ లో గురువారం స్కూల్ ఫౌండర్ రవీందర్ రావు ఆధ్వర్యంలో ప్రతిబింబ్ థీమ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తరగతుల వారీగా మూడు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ప్రతి విద్యార్థిని ప్రోత్సహించి, వారికి సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇంగ్లీష్ కాన్సెప్ట్, డాన్స్ ప్రోగ్రామ్స్, స్కిట్ ప్రోగ్రామ్ లలో ఆసక్తిగా విద్యార్థులు పాల్గొన్నారు. స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, అదేవిధంగా విద్యార్థుల సబ్జెక్టుల నుండి పలు అంశాలను తీసుకొని, వాటికి స్పీకింగ్ అండ్ డాన్సును జోడించి




వినూత్న ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా వాటర్ సైకిల్, ఫైవ్ ఎలిమెంట్, ఎలక్ట్రో మాగ్నెటిజం, జంక్ ఫుడ్స్, సేవ్ సాయిల్, సేవ్ గంగా, మ్యాథ్స్ మ్యాజిక్, ట్రాఫిక్ సిగ్నల్, ఫండమెంటల్ రైట్స్, వివిధ రకాల వృత్తులు, సోలార్ సిస్టం, పార్ట్స్ ఆఫ్ స్పీచ్ , సేవ్ బర్డ్స్ వంటి వాటి గురించి ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వేడుకకు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్ రావు తో పాటు వారి సతీమణి సురభి దుర్గా వాణి, ప్రిన్సిపల్ సురభి తేజస్విని, ఇన్చార్జ్ లు, స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

### దృఢ సంకల్పంతో మల్కాజ్ గిరిలో భారీ మెజార్టీ అందించాలనే లక్ష్యంతో ప్రజలు..

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**కూకట్‌పల్లి, వెలుతురు:**
మల్కాజిగిరిలో భారీ మెజారిటీ అందించాలనే లక్ష్యంతో ప్రజలు దృఢ సంకల్పంతో ఉన్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఎంకెఎన్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.




సత్యం శ్రీరంగం, మాజీ టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలంటే, కాంగ్రెస్ అధిష్ఠానం నమ్మకాన్ని నిలుపుకునేలా కూకట్ పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పట్నం సునీత మహేందర్ రెడ్డికి భారీ మెజారిటీ అందించేలా కృషి చేయాలనీ అన్నారు. అనంతరం సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కూకట్ పల్లి తరుపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్కాజ్ గిరిలో భారీ మెజారిటీ అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయడానికి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు మరియు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేటి పాపం.. భావితరాలకు శాపమా?

- అధికారం అండతో దర్జాగా నాలా కబ్జా..
- నాలా ఆక్రమణ.. నీటి ప్రవాహానికి అడ్డంగా కట్టడాలు..
- ప్రభుత్వ ఆదాయంతో నాలా పైకప్పు వేసి రోడ్డుగా చిత్రీకరించి బహుళ అక్రమ భవన నిర్మాణం
- భారీ వర్షం కురవగానే కాలనీలోకి వరద పోటు..
- నాలా కబ్జాకు జిహెచ్ఎంసి గ్రీన్ సిగ్నల్?..
- ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తే పరోక్షంగా సహకరిస్తున్న రెవిన్యూ, ఇరిగేషన్, జిహెచ్ఎంసి..

**కూకట్‌పల్లి, వెలుతురు:**
వరద వెళ్లిపోవాలంటే కాల్వలు కావాలి.. వాటిని పూడ్చేసి ఇళ్లు నిర్మిస్తే..? నీరు నిల్వ కావాలంటే చెరువులు ఉండాలి.. వాటిలో కాలనీలు కట్టేస్తే..? మరి వాన నీళ్లన్నీ ఎటు పోవాలి? ఎటూ పోలేకనే.. వరద రోడ్ల మీద పారుతోంది.. కాలనీల్లో ప్రవహిస్తోంది.. ఇళ్లను ముంచెత్తుతోంది.. ఎనలేని నష్టాన్ని మిగుల్చుతోంది! ఇలా కాలువలు చెరువులు కుంటలు ఆక్రమణల పాలవడం వల్లే చిన్న వానకే నగరం వనికిపోతుంది. ఒకటి రెండు చోట్ల కాకుండా రాష్ట్రంలోని చాలా నగరాల్లో, పట్టణాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వివిధ పార్టీల నేతలు, అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై ఎక్కడికి అక్కడ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. నాలాలను, చెరువులను పూడ్చేస్తున్నారు. ఆయా చోట్ల వెంచర్లు వేసి కాలనీలు కట్టేస్తున్నారు. ఇలా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఆక్రమణలకు పాల్పడితే నేటి పాపం భావితరాలకు శాపమేనని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. తాజాగా కూకట్ పల్లిలోని దేవి నగర్ సమీపంలో నాలా పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతుంది. నల్లచెరువు నుంచి నీరు నాలామీదుగా ప్రవహిస్తుండగా ఇటీవల కొందరు తమకు రాజకీయ బలం ఉంది తమను ఎవరు ఏం చేయలేరని కబ్జాకోరులు నాలాలను సైతం వదలడం లేదు. నాలాను ఆక్రమించుకొని పూర్తి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాన్ని నిర్మిస్తున్నారు.



అయితే కబ్జాదారులకు ఓ ప్రజా ప్రతినిధి అండదండలు దండిగా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ప్రజా ప్రతినిధి ప్రభుత్వ ఆదాయంతో నాలా పైకప్పు వేసి నాలాను రోడ్డుగా చూపించి భారీ నిర్మాణం చేపడుతున్న అక్రమార్కులకు అండగా నిలుస్తున్నాడని స్థానికులకు విస్మయానికి గురిచేస్తుంది. ఇక్కడ భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కబ్జాదారులు పెట్రేగిపోయి నాలాను సైతం వదలకుండా ఆక్రమించి రోడ్డుగా చూపించినట్లు తేలింది. అంతేకాకుండా నాలా సమీపంలో నిర్మాణం చేపడుతుండగా పక్కింటి ప్రహరీ గోడ కూలిపోయిన సంఘటన స్థానికంగా ప్రజల్లో కలకలం రేపింది. ఫలితంగా రాబోయే వర్షాకాలంలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో స్థానిక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. నల్ల చెరువు నాలా కబ్జాచేసి నిర్మాణాలు చేస్తుంటే అధికారులకు తెలిసి కూడా కనీసం పట్టించుకోకపోవడం రెవెన్యూ, ఇరిగేషన్, జిహెచ్ఎం అధికారులు కబ్జాదారులతో చేతులు కలిపారని స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులు అధికారులు వస్తే అధికారం అండతో మామూలుగా బుట్టలో పడేస్తున్నారని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ఓపెన్ నాలాలను సైతం కబ్జా చేసేలా జీహెచ్ఎంసీ అధికారులు ప్రోత్సహిస్తున్నారంటే పరిస్తితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఏకంగా జీహెచ్ఎంసీ అధికారులే, తమకు పర్మిషన్ ఇచ్చారని ఏకంగా కబ్జాదారుడే చెప్తున్న మాటలు, ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. నాలా ఉన్నప్పటికీ నిర్మాణానికి అధికారులు అనుమతులు ఎలా ఇస్తారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీలైనంత త్వరగా నిర్మాణాలను తొలగించకపోతే భవిష్యత్‌లో వరదనీటి సమస్యలు పునరావృతమవుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో శేర్లింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు

- ప్రజా నాయకుడు వెంటే బస్తీ వాసులు...
- చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం భారీ మెజారిటీని అందించడం ఖాయం..
- కాంగ్రెస్ కార్యకర్తలే మా బలం.. బలగం...
- అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ పార్టీ..
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,కాంటెస్టడ ఎమ్మెల్యే.. వి.జగదీశ్వర్ గౌడ్..



**శేర్లింగంపల్లి, వెలుతురు:**
పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో శేర్లింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని శేర్లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ విమర్శించారు. గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ హఫీజ్ పెట్ డివిజన్ సుబాష్ నగర్ బస్తికి చెందిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు హమీద్, హనీఫ్, ఇస్మాయిల్ ఖాన్ ఆధ్వర్యంలో ఇబ్రహీం, ఉస్మాన్, అదృష్ట, సూర్యప్రతాప్ రెడ్డి, ఆసన్న, రిజవాన్, హాఫీజ్, ఫిరోజ్, అమీర్, రఫీ, తమీర్, జలీల్, కృష్ణ, వంటల కృష్ణ, ఇబు, స్వామి, దేవనంద్, మినాజ్, ఫైజాన్, నర్సింహ, ముత్యాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని, ప్రతి కార్యకర్తకు జగదీశ్వర్ గౌడ్ కి అండగా ఉంటూ ఆయన బాటలోనే పయనిస్తామని అన్నారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదమే తన బలం బలగమని,శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీ సాధిస్తుందని అన్నారు. ఎంపీగా కాంగ్రెస్ గెలుస్తే మరింత అభివృద్ధి చేసుకొనే అవకాశం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని అన్నారు. అందుకు కార్యకర్తలు ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేలాని కోరారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షురాలు రేణుక, శేఖర్ ముదిరాజ్, రవి కుమార్, గుటూరు రాజు ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, కంది చిన్న, ప్రవీణ్ కుమార్, మహేష్, దేవరాజ్, ఓ.బి.సి సెల్ కన్వీనర్ హరికృష్ణ, సుధాకర్, రాజేందర్, శ్రీను, బుజెందర్, సంపత్ యాదవ్, కంది పెంటయ్య, పాండు, సాదిక్, హనీఫ్, అంజయ్య, నందు, వాలి, యాదయ్య, గోపాల్ గౌడ్, రషీద్, సాయికిషోర్, గౌస్, కళ్యాణ్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చారు సీఎం రేవంత్ రెడ్డి : మంత్రి తుమ్మల

- మల్కాజ్ గిరి ప్రాంతాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు : బండి రమేష్

**కూకట్‌పల్లి, వెలుతురు:**
పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్ గిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కూకట్ పల్లి ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో నియోజకవర్గ ఇంఛార్జ్ బండి రమేష్ అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడని అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్ కు కనీసం అభ్యర్థులు కూడా దొరకడం లేదని కాంగ్రెస్ వైపు అందరూ చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ మల్కాజ్ గిరి ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని రేవంత్ రెడ్డికి కొడంగల్ ఎలాగో , మల్కాజ్ గిరి ప్రాంతం కూడా అలాంటిదేనని రేవంత్ రెడ్డిని మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిపించి పంపించడంతో వారి ప్రతిష్ట అధిష్టానం వద్ద పెరిగి వారు నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. అదేవిధంగా స్థానికులైన సునీత మహేందర్ రెడ్డిని ఇక్కడి నుంచి గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం అత్యధికంగా నిధులను



తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని అన్నారు. గత 20 ఏళు ్లగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గా ఉండి ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. సునీత మహేందర్ రెడ్డి దంపతులకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందన్నారు. సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి తెలంగాణ ప్రాంతం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే మన పార్లమెంటు నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలి అన్నారు. మన పార్లమెంటు నియోజకవర్గాన్ని గెలిపించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టేముక్కల వెంకటేశ్వరరావు, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి , శేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్ , కాంగ్రెస్ స్టేట్ మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి మరియు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ అధ్యక్షులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

**తుర్కయంజాల్, వెలుతురు:**
గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజవర్గం పరిధిలోని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో సిఐ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం సిఐ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనీ తెలిపారు. పోలీసులకు వచ్చిన పక్క సమాచారంతో ఆదిబట్ల గ్రామంలోని బీర్పప్ప దేవాలయం ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్న దూల్ పేట జిన్సీ చౌరాయి ప్రాంతానికి చెందిన రాజు సింగ్ (37), తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ ప్రాంతానికి చెందిన లోకేశ్వర్ (20) లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామనీ అన్నారు. నిందితుల వద్ద నుంచి 3.2 కిలోల గంజాయిని, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు కృష్ణయ్య, వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ చైర్మన్‌లను సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**జహీరాబాద్, 29 మార్చి వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర బి.సి.సంక్షేమ మరియు రావాణా శాఖమంత్రి పొన్నం. ప్రభాకర్ తమ



స్వగృహంలో శుక్రవారం నూతన నియమితులైన తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి రాష్ట్ర మంత్రి వర్యులు పొన్నం.ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ నాయకుల కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇంటిటింటికి వెళ్ళి ఎన్నికల ప్రచారం

**జహీరాబాద్, 29, మార్చి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ హమాలి కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అయినటువంటి బీబీ పాటిల్ కు ఆశీర్వదించాలని జహీరాబాద్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా



కార్యదర్శి అరుణ కవలస్, రాష్ట్ర సుదీర్ బండారి, పట్టణ అధ్యక్షులు మఠం విశ్వనాథ్, పట్టణ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలింకర్ సంతోష్, (205) అధ్యక్షులు దప్పు విజయ్, (206) బూత్ అధ్యక్షులు సాయిరాం, శోభారాణి, అర్చన శారద, అనిత, స్వామి, నిలేష్, పాలింకర్, అప్పం శ్రావణ్, టేకురి వెంకటేష్, శ్రీనివాస్, యాదవ్, మురళి, దత్తు, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటున్న రఘునందన్ రావు

### భారతీయ జనతా పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు గట్టు రవీందర్ ముదిరాజ్

**సిద్దిపేట రూరల్, వెలుతురు మార్చ్29:**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామంలో శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు కార్యక్రమంలో భాగంగా ఈరోజు మధ్యాహ్నము కొత్త బంగారం తేవడం జరిగింది సాయంత్రం 8 గంటలకు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవానికి విచ్చేయుచున్న మెదక్ భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు కి అప్పలాయ చెరువు ముదిరాజ్ కుల బంధువులు మరియు భారతీయ జనతా పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు గట్టు రవీందర్ స్వాగతం పలుకుతున్నారు




## వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు

**కొల్చారం మార్చ్ 29(వెలుతురు న్యూస్):**
రానున్న పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మండల వ్యాప్తంగా పోలీసులు భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రజలు ఎవరు



ఎన్నికల కోడ్ను ఉల్లంఘించవద్దని, 50వేలకు మించి నగదు తీసుకెళితే తగిన ఆధారాలు చూపెట్టాలని, ఆధారాలు లేని నగదు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా పోలీసులు చేపట్టిన వాహన తనిఖీలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహమ్మద్ గౌస్, కానిస్టేబుల్ లు మహేష్, నర్సింలు తదితరులు ఉన్నారు.





## సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లే
# ఓట్లు ఎలా అడుగుతారు...

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేటలో అభివృద్ధిని రేవంత్ అడ్డుకుంటున్నారు నేను శాంక్షన్ చేసిన వెటర్నరీ కాలేజీని కొండంగల్‌కి తరలించాడు.**

**కేసీఆర్ చెంత ఉన్న నాయకులను కాంగ్రెస్ ఇదివరకు కూడా తీసుకెళ్లింది**

**కాంగ్రెస్ కొంతమంది నాయకులను కొంటుందేమోగాని బీఆర్ఎస్ కార్యకర్తలను కొనలేదు**

**పేద పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్నాడు విద్యావంతుడు కలెక్టర్‌గా పనిచేసిన ఆయనను గెలిపించుకుంటే ఢిల్లీలో మన గొంతు బలంగా వినిపిస్తాడు నిధులు తీసుకొస్తాడు**



**సిద్దిపేట టౌన్, వెలుతురు మార్చ్29:**
ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ రానే రాదన్న తెలంగాణను కేసీఆర్ సాధించి పెట్టాడు కేసీఆర్ కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేం కేసీఆర్ చెంత ఉన్న నాయకులను కాంగ్రెస్ ఇదివరకు కూడా తీసుకెళ్లింది..

కాంగ్రెస్ కొంతమంది నాయకులను కొంటుందేమోగాని బీఆర్ఎస్ కార్యకర్తలను కొనలేదు పార్టీ ద్వారా పదవులు పొంది ద్రోహం చేసినవాళ్లను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదు

సిద్దిపేట కార్యకర్తలకు ఇది పరీక్ష నా ఎన్నిక కోసం మీరు ఎంత కష్టపడ్డారో వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కూడా అంతే కష్టపడాలని కోరుతున్నా. నాకొచ్చినంత మెజారిటీతో ఆయనను గెలిపించాలి

సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు ఇక్కడికొచ్చి సిగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదు 2 లక్షలు రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయండి

యాసంగి వడ్లకు 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ బాండు పేపర్లు ఇచ్చింది. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు? కారుకు ఓటేసి వాళ్లకు గుణపాఠం నేర్పాలి ఇప్పుడు వడ్లు వస్తున్నా రైతుబంధు 15వేలు ఇంకా ఇవ్వలేదు పదివేలు కూడా రాలేదు 15 వేల రైతుబంధు వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు రాని వాళ్లకు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి అవ్వాతాతలకు బీడీ గీత కార్మికులకు ఇతర పింఛనుదారులకు 4 వేల పింఛన్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసింది వాళ్లందరికీ ఈ విషయం వివరించాలి.

వందరోజుల్లో హామీలను అమలుచేస్తామని మాట తప్పిన కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేసి మోసపోవద్దు

సిద్దిపేటలో అభివృద్ధిని రేవంత్ అడ్డుకుంటున్నారు నేను శాంక్షన్ చేసిన వెటర్నరీ కాలేజీని కొండంగల్‌కి తరలించాడు. శిల్పారామం అల్లీపూర్ డబుల్ రోడ్డు పనులను మధ్యలోనే అడ్డుకొని నిధులను కొడంగల్‌కు తరలిస్తున్నాడు కొడంగల్‌కు నువ్వు ఏమైనా తీసుకుపో కానీ సిద్దిపేటకు వచ్చినవి తీసుకపోతే చూస్తూ ఉరుకోం సిద్దిపేట ప్రజలు కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతు చేస్తారు సిద్దిపేట మీద రేవంత్‌కు ఇంత పగ ఎందుకు?

కేసీఆర్ మాట తప్పని మనిషి కల్యాణలక్ష్మి పింఛన్లు ఏ హామీ విషయంలోనూ మాట తప్పలేదు సిద్దిపేటపై బీజేపీకి ఎందుకింత ద్వేషం? రఘునందన్ దుబ్బాక నుంచి గెలిచినా ఎందుకు ఢిల్లీ నుంచి నిధులు తీసుకురాలేదు? ఇతనికి ఓటేయడం మన వేలితో మన కంటినే పొడుచుకోవడం ఇతడు గెలిస్తే మనకు న్యాయం చేస్తాడా? రఘునందన్ బాగా పనిచేస్తే మొన్నటి ఎన్నికల్లో 54 వేల ఓట్ల తేడాతో ఎందుకు ఓడించిన్రు?

సిద్దిపేటలో ప్రతి అంగుళంపైనా అవగాహన ఉన్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి సిద్దిపేటలో 2 వేల డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించడంలో ఆయన పాత్ర కీలకం పేద పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్నాడు విద్యావంతుడు కలెక్టర్‌గా పనిచేసిన ఆయనను గెలిపించుకుంటే ఢిల్లీలో మన గొంతు బలంగా వినిపిస్తాడు నిధులు తీసుకొస్తాడు సిద్దిపేట ఒక ఆలయంగా నేను పనిచేశాను సిద్దిపేట ప్రజలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నాను ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టాలి అప్పుడే వాళ్లకు తాము మోసం చేశామని తెలుస్తుంది తెలంగాణ గొంతుక ఆత్మగౌరవ ప్రతీక అయిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి.

## ఉపాధిహామీ కూలీలకు కొలతల నిబంధనలు లేకుండా
# ప్రతి రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

**కరీంనగర్,మార్చ్ 29(వెలుతురు న్యూస్):**
కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు కొలతల నిబంధనలు లేకుండా ప్రతి రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

ఉపాధిహామీ కూలీలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 28 రూపాయల వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కూలీలకు ఒరిగేది ఏమిలేదని అన్నారు.క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక కొత్త నిబంధనలు తెచ్చి వారిని శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా ప్రతి రోజు



కూలీ 600 రూపాయలు ఇవ్వడం ద్వారానే వారి కుటుంబ పోషణ సజావుగా జరుగుతుందని అన్నారు.వందల్లో కూలీ పెంచాల్సింది పోయి రూపాయలలో పెంచడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని హితువు పలికారు.

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధిహామీ పథకం ఎత్తివేతకు కుట్ర పన్నారని అందులో భాగంగానే ప్రతి బడ్జెట్లోకూలీల సంఖ్య పెరుగుదలను బట్టి నిధుల కేటాయింపులు పెంచాలి కానీ ప్రతి బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులో కోత పెడుతున్నారని ఆరోపించారు. ఉపాధి కూలీల పై ప్రేమ ఉంటే తక్షణమే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేటును 600 లకు పెంచాలని వారికి పని గ్యారంటీ చట్టం తేవాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పని ప్రదేశాల్లో
# కనీస సౌకర్యాలు కల్పించండి...

### బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు మౌలిక వసతులు కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు విస్తృతంగా జరుగుతున్న సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కూలీల పనుల సమయాన్ని 7 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగించాలని ఎక్కువ సమయం వరకు చేయించడం వల్ల ఎండ దెబ్బ కొట్టి కూలీలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడిందన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనికి ముందు,పని అయిపోయిన తర్వాత రెండు సార్లు ఫోటో అప్ లోడ్ చేసే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని. వర్షాలు లేక వ్యవసాయేతర భూములు గట్టిగా మారాయని అట్టి ప్రదేశాల్లో కొలతలు పెట్టి కూలీలతో పనులు చేయించడం వల్ల భూమి గట్టిగా ఉండడంతో కొలతల ప్రకారం పనులు చేయక సరైన వేతనం పడక కూలీలు



శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలు లేకుండా పని కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## ఆకస్మిక మంటలతో ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం

**కొల్చారం మార్చ్ 29(వెలుతురు న్యూస్):**
మెదక్ జిల్లా కొల్చారం మండలం దుంపలకుంట ఎక్స్ రోడ్ వద్ద చూస్తుండగానే ఆకస్మిక మంటలు చెలరేగి ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పాత్లోత్ రామ్ చరణ్ సింగ్ తన మొబైల్ షాప్ ముందర ఎలక్ట్రిక్ స్కూటీకి ఛార్జింగ్ పెట్టే ప్రయత్నంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఉవ్వెత్తున మంటలు చెలరేగడంతో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది.

## పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలకు

# సగం స్థానాలు ఇవ్వాల్సిందే..



### ప్రజా పాలన పేరుతో కులపాలన చేయొద్దు

### కేసీఆర్ చేసిన తప్పిదమే కాంగ్రెస్ చేస్తే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించిక తప్పదు

### రాహుల్ గాంధీని తప్పు దారి పట్టించి బిసిలకు అన్యాయం చేస్తున్నరు

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు మార్చి 29:
ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సగం పార్లమెంటు స్థానాలను కేటాయించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హైదరాబాదులోని సికింద్రాబాద్లో గల విశ్వకర్మ సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుంధారం గణేష్ చారి తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు

ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో బీసీలకు అసెంబ్లీ టికెట్లు ఇస్తానని హామీ ఇచ్చి విస్మరించిందని అయినప్పటికీ కెసిఆర్ ఓటమి లక్ష్యంగా బీసీలకు రాజకీయంగా నష్టం జరిగిన భరించామన్నారు కానీ నేడు కాంగ్రెస్ పార్టీ సబ్బండ కులాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీలను కాదని ఇతర పార్టీలో ఉన్న అగ్రకులాలను రాత్రికి రాత్రి తీసుకొచ్చి టికెట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బీసీ కులగనణ చేపట్టాలని బీసీలకు రాజకీయ అధికారం ధక్కాలని దేశంలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల రాజకీయ కూటమిని కలుపుకొని ముందుకు కెళ్తుంటే రాహుల్ గాంధీ విధానానికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఒకే సామాజిక వర్గానికి పార్లమెంటు టికెట్లు కేటాయించడం చాలా అన్యాయం అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం ఆత్మగౌరవ నినాదంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పూర్తిగా ధినిని విస్మరించాచాలని చూడడం చాలా బాధాకరమన్నారు

ఇప్పటికీ టిఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంటు స్థానాలకు గాను ఆరు పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇచ్చిందని, అలాగే బిజెపి ఐదు పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం 12 పార్లమెంటు స్థానాలు ప్రకటిస్తే ఇందులో బీసీలకు కేవలం ముగ్గురికి మాత్రమే ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు ఇంకో ఐదు పార్లమెంట్ స్థానాలకు బీసీలకు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు

బీసీలకు టిఆర్ఎస్ బిజెపి కంటే ఎక్కువ టికెట్లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు మంత్రి పదవులు ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవులు నుండి మొదలుకొని నేటి పార్లమెంటు టికెట్ల వరకు ఒకే అగ్రకుల సామాజిక వర్గానికి కేటాయించడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధమన్నారు రాష్ట్రంలో ఒకవైపు ప్రజా పాలన పేరుతో ఇంకొక వైపు కులపాలన చేయడం మంచిది కాదని ఆయన హితవు పలికారు 60 శాతం పైగా బీసీ జనాభా ఉన్నప్పటికీ భువనగిరి మహబూబ్నగర్, నిజామాబాద్ తదితర పార్లమెంట్ స్థానాలు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తన తప్పును సరిదిద్దుకొని బీసీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు

గత ప్రభుత్వంలో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి బీసీ ఎస్సీ ఎస్టీలను విస్మరించి ఇతర పార్టీలలో ఉన్న అగ్రకులాలను తమ పార్టీలోకి అరువు తెచ్చుకొని రాజకీయంగా పెద్దపీట వేయడంతోనే టిఆర్ఎస్ పార్టీకి బీసీ ఎస్సీ ఎస్టీలు గుణపాఠం చెప్పారని కెసిఆర్ చేసిన తప్పిదమే మళ్లీ కాంగ్రెస్ పార్టీ చేస్తుందని బీసీలు భావిస్తున్నారని అయన అన్నారు. ఇదే వైఖరి అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి తో పాటు బీసీ సంఘం జాతీయ సీనియర్ నాయకులు బత్తిని రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గూడూరు భాస్కర్ మేరు వరికుప్పల మధు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

### తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు

నల్లగొండ జిల్లా వెలుతురు మార్చి 29:
నల్గొండ తపస్ జిల్లా సమావేశం కు హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడిన తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను ప్రకటించాలి ప్రభుత్వంను కోరారు. అవసరం కోసం వాడుకునే సరెండర్, మెడికల్, జీపీఎఫ్ ఇతర పార్ట్ ఫైనల్, ఫైనల్ పేమెంట్స్ పెండింగ్ బిల్లులను సీఎం గారు ఇచ్చిన హామీ మేరకు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు ఇతర దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఇటీవల నిర్వహించిన సమావేశం లో తీసుకున్న నిర్ణయం మేరకు స్కావేంజెర్స్, విద్యాలయాలకు ఉచిత విద్యుత్ ను ఈ నెల నుండే అమలు చేయాలి. పదోన్నతులు బదిలీలు పూర్తి చేసే విధంగా సత్వరం తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ముఖ్యంగా పాఠశాలలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్స్ సరిపోవడం లేదని మౌలిక వసతుల కల్పనకు ఇప్పుడున్న గ్రాంట్ రేషియో ను రెట్టింపు చేసి ఏక మొత్తం లో ఒకేసారి పాఠశాల ప్రారంభం లోనే



స్కూల్ అకౌంట్లో వేయాలి. విద్యార్థులకు మధ్యాహ్నభోజనం నాన్యత పెంచాలంటే ఒక్కో విద్యార్థికి ఇచ్చే అమౌంట్ 15/- చేసి, సిబ్బంది కి హనారోరియం ను పెంచాలి.. అపుడే పోషకాహారం విద్యార్థులకు అందుతుంది. తెలంగాణ రాష్ట్రములో నూతన జాతీయ విద్యా విధానం అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ ను పటిష్టం చేయాలని కోరారు. ఈ సమావేశనికి రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య. జిల్లా అధ్యక్షులు ఇరుగు శ్రీరాములు అధ్యక్షత వహించిన్నారు. ఈ సమావేశం



లో జిల్లా ప్రధాన కార్యదర్శి బోలిశెట్టి బిక్షపతి,రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, లింగయ్య, గోపాల్ రెడ్డి, చంద్రయ్య, యామిని, శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శివర్గం, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ తలపెట్టిన నమో యాప్ మైక్రో డొనేషన్ ప్రారంభోత్సవంలో

# పాల్గొన్న సంగారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ పులిమామిడి రాజు

వెలుతురు వెలుతురు మార్చి 29:
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి గారి పిలుపుమేరకు " నమో ఆప్ మైక్రో డొనేషన్ క్యాంపెయిన్ " కార్యక్రమాన్ని శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రారంభించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి విచ్చేసినారు. ఇట్టి కాయాక్రమాన్ని ఉద్దేశించి సంగారెడ్డి అసెంబ్లీ ఇన్చార్జ్ పులిమామిడి రాజు మాట్లాడుతూ నమో యాప్ ద్వారా భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులందరూ మరియు మన స్నేహితులు, బంధువులు, ప్రతి ఒక్కరు కూడా తనకు తోచినంత ఫండ్ ను వంద రూపాయల నుండి 2000 రూపాయల వరకు నమో యాప్ ద్వారా బిజెపి పార్టీకి చెల్లించవలసిందిగా కోరడం జరిగింది. దీని కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోవు పార్లమెంటు ఎన్నికలలో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త గట్టిగా పని చేసి మన అన్న దుబ్బాక టైగర్, తెలంగాణ ప్రజల గొంతుక మాధవనేని రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి పార్టీ కుటుంబ సభ్యులను కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓదెల మాణిక్ రావు, కొలుకూరి



రాజశేఖర్ , చారి, పదాధికారి డాక్టర్ రాజు గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, కౌన్సిలర్లు మందుల నాగరాజు, కసిని వాసు, ఎన్నారై విష్ణువర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, పాపన్న, శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి, శ్రీనివాస్, కూచిని సతీష్, జంగన్న, ఆదిత్య, సత్యవతి, మీనా గౌడ్, తేజస్విని, అరుణ, ఈశ్వరి రెడ్డి, గొర్లిల్లా శివలింగం, వి.శ్రీశైలం, మల్లెం లక్ష్మణ్, నల్ల సాయి కిరణ్, లింగమూర్తి, సోమశంకర్, నియోజకవర్గంలో ఉన్నటువంటి శక్తి కేంద్రం ఇంచార్జ్ లు, మరియు ఆ పై స్థాయి నాయకులు అందరూ కూడా పాల్గొన్నారు.

## అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా వీరబోయిన రజిత గౌడ్, బోయపల్లి శ్రీలత గౌడ్ లను నియమించిన కూరెళ్ళ వేములయ్య గౌడ్

హైదరాబాద్ వెలుతురు మార్చి 29:
శుక్రవారం రోజున అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ళ వేములయ్య గౌడ్ గారి చేతుల మీదుగా నియామకపత్రమును అందజేయడం జరిగింది.
అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా కాప్రాకు చెందిన వీరబోయిన రజిత గౌడ్ ను మరియు రంగారెడ్డి జిల్లా కు చెందిన బోయపల్లి శ్రీలత గౌడ్ లను నియమించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి మిద్దెల మల్లేశం గౌడ్, తదితరులు పాల్గొని నియామక పత్రాలు అందజేయడం జరిగింది.

కూరెళ్ళ వేములయ్య గౌడ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో గౌడ సామాజిక వర్గానికి సంబంధించిన గీత కార్మికులకు యువకులకు ప్రోత్సహిస్తూ వారికి వెన్నంటే ఉంటూ సహాయ సహకారాలు అందిస్తూ అఖిల భారత గౌడ సంఘం నియమ నిబంధనలకు కట్టుబడి, గౌడ సామాజిక వర్గంతో కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి పదంలో నడిపించే విధంగా ఉండాలని తెలియజేయడం జరిగింది అన్ని కూరెళ్ళ వేములయ్య గౌడ్ అన్నారు.





## 31 అశు కవితా పద్యధార సాహిత్య కార్యక్రమం

సిద్దిపేట టౌన్, వెలుతురు మార్చ్29:
మార్చ్ 31 ఆదివారం రోజున ఉదయం హరిహర రెసిడెన్సి సిద్దిపేట సమీపంలో గల లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా అశు కవితా పద్యధార కార్యక్రమం కలదని దేవాలయ నిర్వాహకులు పందరి రాధాకృష్ణ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం తెలిపారు. లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్నటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన మరియు అవధానులు దోర్బల ప్రభాకరశర్మ ములుగ అంజయ్య,తీగుళ్ళ శ్రీకాంతశర్మ ఆధ్వర్యంలో అశు కవితా పద్యధార కలదని ఇట్టి కార్యక్రమాలలో రాష్ట్రస్థాయిలోని ప్రముఖ పద్య కవులు పాల్గొంటున్న సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని సాహితీ ప్రియులు కవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు.



## గుడ్ ఫ్రైడే సందర్భంగా సిద్దిపేట చర్చిలో

# క్రిస్టియన్స్ ప్రత్యేక ప్రార్థనలు

### చర్చ్ పాస్టర్ స్టీవెన్ జ్ఞాన కుమార్

సిద్దిపేట టౌన్, వెలుతురు మార్చ్29:
సిద్దిపేట ప్రజల అందరికి గుడ్ ఫ్రై డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి దేవుడు ప్రత్యేకంగా అందరిని ఆశీర్వదించాలని ప్రార్థన చేశారు మమ్రే చర్చ్ లో క్రైస్తవులు గొప్ప పర్వదినముగా ఉపవాసములతోను క్రీస్తు సిలువమీద పలికిన ఏడు మాటలను ధ్యానము చేస్తూ శుభ శుక్రవారపూ ఆరాధన జరుపుకొన్నారు చర్చ్ పాస్టర్ స్టీవెన్ జ్ఞాన కుమార్ భూ ప్రజలందరి పాపక్షమాపణ కొరకై మరియు మోక్ష భాగ్యము అందించట కొరకు యేసు క్రీస్తు తన పవిత్ర రక్తము చిందించి ప్రాణము అర్పించి మరియు మూడవ రోజున సమాధిలో నుండి లేచారని దైవ సందేశమును అందించారు దేవుని పవిత్ర రక్తము అవసరము అందుకే దేవుడు దేవుని కుమారునిగా ఈ లోకానికి వచ్చి సిలువలో పవిత్ర రక్తము కార్చారు అని వివరించారు విశ్వాసము వలన ప్రజలందరికీ పాప క్షమాపణ కలుగునని తెలియ జేశారు.



## మాజీ టిఎస్ఐడిసి చైర్మన్ తన్విర్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

జహీరాబాద్, 29 మార్చి, వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తమ నివాస గ్రహంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మాజీ టి ఎస్ ఐ డి సి ఛైర్మన్ మొహమ్మద్ తన్విర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి



గాలి అనిల్ కుమార్ హాజరయ్యారు. అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన మాజీ టిఎస్ఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ కు జహీరాబాద్ బి ఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మంకల్ సుభాష్, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ , పి ఏ సి ఎస్ ఛైర్మన్ మాచెందర్, మాజీ మార్కెట్ లు చైర్మన్ గుండప్ప, రామకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు కుత్బుద్దీన్, సయ్యద్ మసూద్ హుస్సేన్, మాజీ కౌన్సిల్లర్ లు రాములు నేత, మోతి రామ్, అబ్దుల్లాహ, నాయకులు మజర్, ఇబ్రహీం, అక్రమ్, శ్రీనివాస్ నాయక్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.





## చింతచిగురు రొయ్యల కూర

**కావల్సినవి:**

చింత చిగురు కప్పు, కాస్త పెద్ద రొయ్యలు పావుకిలో, ధనియాల పొడి చెంచా, జీలకర్రపొడి అరచెంచా, ఉల్లిపాయ ఒకటి, కొత్తిమీర కట్ట, వెల్లుల్లి రేకలు ఐదారు, నూనె మూడు టేబుల్‌స్పూన్లు, గసగసాల పొడి చెంచా, దాల్చిన చెక్కపొడి అరచెంచా, అల్లం వెల్లులి పేస్టు చెంచా, పసుపు చిటికెడు, ఉప్పు తగినంత, పచ్చిమిర్చి ఐదు, కారం చెంచా.



**తయారీ:**

ముందుగా రొయ్యలని శుభ్రం చేసి పెట్టుకుని అందులో పసుపూ, కొద్దిగా ఉప్పూ, సగం అల్లంవెల్లుల్లి పేస్టు వేసి వాటికి పట్టేట్టుగా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసి అది వేడెక్కాక తరిగిన ఉల్లిపాయముక్కలూ, పచ్చిమిర్చీ వేసి దోరగా వేయించుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు వేగాక అందులో రొయ్యలు కూడా వేయాలి. పచ్చివాసన పోయేవరకూ వేయించి అప్పుడు మూత పెట్టి మరికాస్త సేపు మగ్గనివ్వాలి. ఇప్పుడు చింతచిగురుని అరచేతుల్లో వేసి బాగా నలిపితే పొడిలా తయారవుతుంది. దీన్ని రొయ్యల్లో వేసి మిగిలిన అల్లంవెల్లుల్లి పేస్టూ, వెల్లుల్లిరేకలూ చేర్చాలి. తర్వాత ఉప్పూ, కారం, గసగసాలపొడీ, జీలకర్రపొడి, దాల్చిన చెక్కపొడి, ధనియాలపొడి వేసుకోవాలి. అవన్నీ వేసి బాగా కలిపిన తర్వాత కాసిని నీళ్లు పోసి మూతపెట్టేయాలి. ఇందులో ప్రత్యేకించి మసాలా వేయాల్సిన అవసరం లేదు. కూర దగ్గరకు వచ్చిన తర్వాత దింపేసి, కొత్తిమీరతో అలంకరిస్తే చాలు.

# రొయ్యల స్పెషల్స్

## గోంగూరతో రొయ్యల కూర

**కావలసినవి:**

రొయ్యలు: పావుకిలో, గోంగూర: 4 కట్టలు(సన్నవి), పచ్చిమిర్చి: 15, ఉల్లిపాయలు: రెండు, ఎండుకొబ్బరి పొడి: టీస్పూను, అల్లంవెల్లుల్లి: 2 టీస్పూన్లు, గరం మసాలా : టీస్పూను, కారం: టీస్పూను, పసుపు: అరటీస్పూను, కొత్తిమీర తురుము: టేబుల్‌స్పూను, ఉప్పు: తగినంత, నూనె: 4 టేబుల్‌స్పూన్లు,

**తయారుచేసే విధానం:**

బాణలిలో గోంగూర, సన్నగా చీల్చిన పచ్చిమిర్చి, ఉప్పు వేసి వేయించాలి. తరవాత మిక్సీలో వేసి ముద్దలా చేయాలి. మరో బాణలిలో నూనె వేసి కాగాక ఉల్లిముక్కలు వేసి వేగాక రొయ్యలు వేసి ఓ నిమిషం ఉడికించాలి. రొయ్యల్లోంచే నీరు వస్తుంది. ఉప్పు, కారం, పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద వేసి బాగా కలపాలి. నీరు సరిపోదు అనుకుంటే కొద్దిగా పోసి ఉడికించాలి. రొయ్యలు ఉడికిన తరవాత ఎండుకొబ్బరి, గరంమసాలా, కొత్తిమీర తురుము, గోంగూర ముద్ద వేసి బాగా కలిపి నూనె తేలేవరకూ ఉడికించి దించాలి.



## ప్రాన్స్ సాంబార్ మసాలా

**కావల్సినవి:**

నూనె నాలుగుటేబుల్‌స్పూన్లు, ఉల్లిపాయలు నాలుగు, కొబ్బరి తురుము పావుకప్పు, వెల్లుల్లి ముద్ద టేబుల్‌స్పూను, టొమాటోలు ఆరు, జీలకర్రపొడి చెంచా, పసుపు చిటికెడు, కారం చెంచా,సాంబార్ మసాలా చెంచా, నీళ్లు కప్పు, వెనిగర్ చెంచా, చక్కెర టేబుల్‌స్పూను, కొత్తిమీర కట్ట, ఉప్పు తగినంత.



**తయారీ:**

ముందుగా బాణలిలో నూనె వేడిచేసి ఉల్లిపాయ ముక్కలు వేయించాలి. అవి వేగాక వెల్లుల్లి ముద్ద వేయాలి. రెండు నిమిషాల తరవాత కొబ్బరి ముద్ద వేయించాలి. కొబ్బరి పచ్చివాసన పోయాక కాసిని నీళ్లు చల్లాలి. అందులో టొమాటో ముక్కలూ, తగినంత ఉప్పూ, జీలకర్రపొడి, పసుపు, కారం, సాంబార్ మసాలా వేసేయాలి. కొన్ని నిమిషాలకు ఇది గ్రేవీలా తయారవుతుంది. అప్పుడు శుభ్రం చేసిన రొయ్యలూ, నీళ్లూ, చక్కెరా, వెనిగర్ వేసి బాగా కలపాలి. రొయ్యలు ఉడికి ఇది గ్రేవీలా తయారయ్యాక కొత్తిమీర చల్లి దింపేస్తే సరిపోతుంది.

## రొయ్యల కిచిడీ

**కావల్సినవి:**

శుభ్రం చేసి, కారం, ఉప్పు పట్టించిన రొయ్యలు కప్పు, పసుపు అరచెంచా, సాంబార్ పొడి చెంచా, పచ్చిమిర్చి తరుగు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు చెంచా, ఉప్పు తగినంత, కరివేపాకు రెబ్బలు రెండు, టొమాటో, బంగాళాదుంప ఒక్కోటి చొప్పున, కొబ్బరితురుము రెండు చెంచాలు, ఉల్లిపాయలు రెండు, బియ్యం రెండుకప్పులు, నానబెట్టిన పెసరపప్పు టేబుల్‌స్పూను, మినప్పప్పు టేబుల్‌స్పూను(నానబెట్టుకోవాలి), నెయ్యి రెండు టేబుల్‌స్పూన్లు.




**తయారీ:**

కుక్కర్‌ని పొయ్యిమీద పెట్టి నెయ్యి వేయాలి. అది కరిగాక ఉల్లిపాయముక్కలు వేయించాలి. అవి వేగాక పచ్చిమిర్చి తరుగూ, అల్లంవెల్లుల్లి ముద్ద, టొమాటో ముక్కలూ, కరివేపాకు రెబ్బలూ, కొబ్బరితురుమూ, బంగాళాదుంప ముక్కలూ, రొయ్యలు వేయాలి. రొయ్యలు కొద్దిగా వేగాయనుకున్నాక కడిగిన బియ్యం, పెసరపప్పు, మినప్పప్పు, తగినంత ఉప్పూ, పసుపూ, సాంబార్‌పొడి, నాలుగున్నర కప్పుల నీళ్లు పోసి మూత పెట్టేయాలి. మూడు కూతలు వచ్చాక దింపేస్తే చాలు.

# వంటకు నియమాలున్నాయి

- స్త్రీలు వంటచేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే ఇంటిలోని వారంతా ఆరోగ్యంగా ఉంటారు.
- పప్పుదినుసుల్ని, కూరగాయల్ని వాడేదానికి ముందు, ఉడికించిన తర్వాత సరైన పద్ధతులు పాటించి పోషక పదార్థాలు నష్టపోకుండా జాగ్రత్త పడాలి.
- వంట చేయబోయే ముందు చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి. చేతిని తుడుచుకోడానికి మంచిగుడ్డ కాని నాప్‌కిన్ గాని వాడాలి.
- కూరలు తరగటానికి ఉపయోగించే చాకు, కత్తిపీట వంటి వాటిని కడిగిన తర్వాతే వాడాలి.
- ఆకుకూరలనూ, కాయగూరలనూ కూడా తరిగే ముందు కడగాలి.చి వంట పాత్రలను మంచినీటితో కడిగిన తర్వాతే వాటిని వాడాలి.



- పదార్థాలని ఉడికించేటప్పుడు వాటికి తగినన్ని నీళ్ళు మాత్రమే పోయాలి. ఎక్కువ నీళ్ళు పోస్తే దాంట్లోని పోషకాలు నశిస్తాయి.
- ఆవిరి మీద ఉడికించిన (లేక కుక్కరులో వండిన) పదార్థాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.
- పదార్థాల్ని ఏవిధంగా ఉడకబెట్టినా వాటిపై తప్పక మూతలు ఉండాలి.
- ఆకు కూరలలో గడ్డి, పీచు మొదలైనవి లేకుండా చూడాలి. ఒక్కొక్కసారి ఆకుల వెనుక వైపున పురుగు గుడ్లు కూడా ఉంటాయి. అందుకే వాటిని చాలా జాగ్రత్తగా కడగాలి.
- వంటయింట్లోకి గాలి, వెలుతురు బాగారావాలి. తలుపు లెప్పుడూ మూసి ఉంచకండి. మూసి ఉంచినట్లైతే ఒక విధమైన వాసన వస్తుంది. బొద్దింకలు, సాలీళ్ళు మొదలైన క్రిములెన్నో చేరతాయి.
- వంట ఇంటిలో తడి బూజులు లేకుండా చూసుకోవాలి.
- కిచెన్‌లో రాత్రి పూట ఒక చిన్న బల్బును వేసి ఉంచితే బొద్దింకలు, పురుగులు చేరవు.
- పప్పులు కడిగిన నీళ్ళు, కూరలు ఉడికించిన నీళ్ళు సింక్‌లో పోస్తే వెంటనే మంచినీరు పోసి కడగాలి. తర్వాత కొద్దిగా డెటాల్ నీళ్ళను గాని, ఫినాయిల్ కలిపిన నీళ్ళుగాని పోస్తే మురికి వాసన ఉండదు.
- కిచెన్‌లో వంటచేసే చోటును (లేదా స్టౌ పెట్టే గట్టును) సింక్‌ను తరచుగా డెటాల్‌తో కడుగుతుండాలి.
- ఒక అరబకెట్ నీళ్ళలో 2, 3 చుక్కలు డెటాల్ వేస్తే చాలు. ఫినాయిల్ వాసన కిట్టనివారికి ఇది మంచిది.
- కూరలు తరిగేటప్పుడు వచ్చిన పై పొట్టు (లేక పెచ్చులు) ఆకుకూరల మొదళ్ళు వెంటనే తీసుకెళ్ళి డస్ట్‌బిన్‌లో వేస్తుండాలి.
- వెట్‌గ్రైండర్, మిక్సీజార్‌లను వాడిన వెంటనే కడిగి శుభ్రపరచాలి.
- సింక్‌లో కలరాఉండలు వేసి ఉంచితే పురుగులు,బొద్దింకలు రావు.
- మీ పెంపుడు జంతువుల్ని ఎప్పుడూ వంటగదిలోకి రానీయకండి. గ్యాస్ స్టవ్ గురించి జాగ్రత్తలుచి గ్యాస్ స్టవ్‌ని నేలకు రెండున్నర అడుగుల ఎత్తైన బల్లపై గాని అరుగుపై గాని పెట్టి ఉంచాలి.చి స్టవ్‌కు క్రిందుగా రెండు అడుగుల దూరంలో సిలెండర్ అమర్చుకోవాలి.
- సిలెండర్‌ను ఎప్పుడూ నిటారుగా నిలబెట్టే ఉంచాలి. అంతేగాని ఏటవాలుగా గాని , అడ్డంగా గాని పెట్టకూడదు.
- గ్యాస్ స్టవ్‌ని లైటర్‌తోనే వెలిగించడం మంచిది. అగ్గి పెట్టెవద్దు.
- గ్యాస్ స్టవ్ దగ్గర్లో పెట్రోలు, కిర్సనాయిల్ లాంటి మండే పదార్థాలేమీ ఉండకూడదు. కొద్దిపాటి వేడికే అవి అంటుకొంటాయి. కనుక చాలా ప్రమాదం.
- స్టవ్ బర్నర్ స్విచ్‌లను కట్టివేసి రెగ్యులేటర్ కూడా కట్టివేయాలి. అప్పుడు గ్యాస్ లీకేజీకి అవకాశం ఉండదు.
- మీరు వంటిల్లు తెరిచేసరికి గ్యాస్ వాసన వస్తోంటే అగ్గిపుల్ల వెలిగించడం, లైట్ స్విచ్ వేయడం చేయకండి. కిటికీలూ, తలుపులూ అన్నీ తెరచి మెకానిక్ ను పిలవండి. – గ్యాస్ స్టవ్ వెలిగించమనో, ఆర్పివేయమనో పిల్లలని పురమాయించకండి. అసలు పిల్లల్ని స్టవ్ సమీపంలోకే రానివ్వవద్దు. – వంటచేసేటప్పుడు ఎప్పుడూ కాటన్ బట్టలే ధరించండి. – గ్యాస్ స్టవ్ మీదనుండి పాత్రలను, మూకుడు, మొదలైన వాటిని దింపడానికి పట్టకారు ఉపయోగించండి.

# తాపాన్ని తగ్గించే ఫ్రూట్ యోగర్ట్

ఎండలు మండిపోతున్నాయ్. అలా అరగంట బయటికి వెళ్లొస్తే చాలు... ఒంట్లో సగం నీరు బయటికిపోతున్నట్టే అనిపిస్తుంది. అందుకే సమ్మర్ సీజన్లో తీసుకోవాల్సిన ఆహారం వేరే ఉంటుంది. ఒంటికి చల్లదనాన్ని అందించే ఆహారాన్ని తీసుకోవాలి. ఇదిగో ఈ ఫ్రూట్ యోగర్ట్ చేసుకుని తినండి.

**కావాల్సిన పదార్థాలు**

పుచ్చాకయ ముక్కలు రెండు కప్పులు, పెరుగు (చిక్కనిది) ఒక కప్పు, చక్కెర రెండు టీస్పూనులు, తేనె ఒక టేబుల్ స్పూను, కండెన్స్ డ్ మిల్క్ క్రీమ్ రెండు టీస్పూనులు, నిమ్మరసం అర టీస్పూను

**తయారుచేసే విధానం:**

పుచ్చకాయల గింజలు తీసేసి ముక్కలు కోసుకోవాలి. మరీ చిన్నవి, పెద్దవి కాకుండా మీడియం సైజులో ఉండాలి ముక్కలు. వాటిని ప్లాస్టిక్ కవర్ లో వేసి డీఫ్ ఫ్రిజ్ లో రాత్రంతా పెట్టాలి. అవి మంచుముక్కల్లా ఫ్రీజ్ అవుతాయి. ఇప్పుడు మిక్సీ గిన్నెలో ఈ పుచ్చకాయ ముక్కలు, పంచదార, మిల్క్ క్రీమ్, పంచదార, నిమ్మరసం వేసి బాగా తిప్పాలి. మెత్తటి పేస్టులా అవుతుంది. దీనిని తీసి ఒక గిన్నెలో వేసి డీఫ్రీజ్ లో గంటసేపు ఉంచాలి. ఆతరువాత మళ్లీ బయటికి తీసి మిక్సీలో వేయాలి. ఆ పేస్టు ఇంకా మృదువుగా అవుతుంది. దానిని గిన్నెలో వేసి మళ్లీ డీప్ ఫ్రిజ్ లో పెట్టాలి. ఇలా రెండు మూడు సార్లు ఫ్రిజ్ లో పెట్టి తీసి, మిక్సీ వేసి ఇలా చేస్తుంటే అది ఐస్ క్రీములా తయారవుతుంది. అంతే ఫ్రూట్ యోగర్ట్ సిద్ధమైనట్టే. దానిలో చిన్న పండ్ల ముక్కలు వేసుకుని తింటే భలే టేస్టీగా ఉంటుంది.



# 'కందిపొడి' రుచికి ఫిదా అవ్వాల్సిందే..!

తినడానికి ఎన్ని రకాల పదార్థాలున్నా... వాటిలో కొన్నింటిని తింటే మాత్రం మళ్లీ మళ్లీ తినాలనే అనుభూతి కలుగుతూ ఉంటుంది. ఆ కోవకు చెందిందే మన తెలుగు వంటకం 'కంది పొడి'. ప్రతి ఒక్కరు ఎంతో ఆస్వాదిస్తూ తినగలిగే వాటిల్లో ఇదీ ఒకటి. వేడివేడి అన్నంలో కందిపొడి కలిపి అందులో కాస్తా నెయ్యివేసి తింటే ఆ రుచి వర్ణించలేనిది.... మరెందుకు ఆలస్యం 'ఆంధ్ర స్పెషల్ కంది పొడి'ని వెంటనే చేసేద్దాం...

కందిపొడి తయారీకి కావాల్సిన పదార్థాలు...

కందిపప్పు కప్పు, పుట్నాల పప్పు కప్పు, మిరపకాయలు 10 నుంచి 12, జీలకర్ర 3 టీ స్పూన్లు, మెంతులు అర స్పూను, వెల్లుల్లి 10, ఉప్పు సరిపడినంత, కరివేపాకు సరిపడినంత, ఇంగువ కొంచెం.

**తయారీ విధానం...**

* పొయ్యిమీద బాణలి పెట్టి మొదట కందిపప్పును, కాసేపటి తర్వాత పుట్నాల పప్పును వేసి చక్కగా వేయించి పక్కన పెట్టుకోవాలి.

* బాణలిలో స్పూన్ నూనె వేసి..అందులో జీలకర్ర, ఎండుమిర్చి, మెంతులు, కరివేపాకు.. చివరగా వెల్లుల్లి వేసి వేయించుకోవాలి. సన్నని మంట మీద మాత్రమే వేయించుకోవాలి. మాడిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.

* బాగా వేగాక ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి..సరిపడా ఉప్పు, కొంచెం ఇంగువ వేసి మరీ మెత్తగా కాకుండా మిక్సీ చేసుకోవాలి.

* తర్వాత ఈ మిశ్రమానికి వేయించుకుని పెట్టుకున్న కందిపప్పు, పుట్నాల పప్పు జతచేసి పొడిగా అయ్యేవరకు మిక్సీ చేసుకోవాలి.

* కందిపప్పుతోపాటు, కందులు కూడా కలిపి వాడితే మరింత రుచిని ఆస్వాదిస్తారు.





* ఈ పొడిని ఇడ్లీతోపాటు ఇతర టిఫిన్లతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

గమనిక: కందులు, మెంతులు అదనపు రుచికోసం వినియోగించవచ్చు.

**కందిపొడి అన్నం...**

బాణలిలో రెండు లేదా మూడు స్పూన్ల నెయ్యివేసి, అందులో కరివేపాకు వేసి వేయించుకోవాలి. తర్వాత పైన తయారు చేసి పెట్టుకున్న కందిపొడిని నెయ్యిలో వేసి బాగా కలపాలి. తర్వాత అన్నం వేసుకుని కందిపొడి సరిగా కలిసేవరకు కలుపుకోవాలి. పొయ్యి ఆర్పివేసి... కొద్ది సేపటి తర్వాత తింటే రుచికరమైన కందిపొడి అన్నం తిన్న అనుభూతి మీ సొంతం.

శ్రీరస్తు　　శుభమస్తు　　అవిఘ్నమస్తు

# ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప



గణపతి



సుబ్రమణ్యస్వామి



ఓం శ్రీ సత్యనారాయణ స్వామి నమ:



నమో పార్వతి పతయే నమ:



శ్లో॥ ఓంకార మంత్ర సంయుక్తం, నిత్యం ధ్యాయంతి యోగిన: కామదం మోక్షదం తస్మై ఓంకారాయ నమో నమ: ॥

# శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో

గణపతి, సుబ్రమణ్యస్వామి , పార్వతి పరమేశ్వరులు,సత్యనారాయణ స్వామి , అభయాంజనేయ స్వామి , నవగ్రహాలు

# విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక

అభయ ఆంజనేయ



నవగ్రహాలు



స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉత్తరాయన
ఫాల్గుణ మాస బహుళ సప్తమి
తేది 01-04-2024 నుండి 04-04-2024 వరకు

## కార్యక్రమములు

**01.04.2024** సా॥ 4.30 ని॥లకు గణపతి పూజ, విగ్రహాముల ఊరేగింపు.

**02.04.2024** ఉ॥ 8.00 గం॥లకు గణపతి పూజ , పుణ్యాహవాచనం, రక్షా బంధన అఖండ దీపారాధన, ఋత్విక్ వరణ అంకురారోపణ, యాగశాల ప్రవేశం, యోగిని వాస్తూ క్షేత్రపాలక నవగ్రహా సర్వతో భద్ర మండప అవాహన షోడశ ఉపచార పూజలు జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ, అనంతరం అన్న ప్రసాదాన వితరణ.
సా॥ 5. 00 గం॥ లకు మండప పూజలు , ప్రతిష్ఠ , విగ్రహాలకు క్షీరాధివాసం, ఆవాహిత దేవత హోమాలు.
రాత్రి 08.00 గం॥ లకు తీర్ధ ప్రసాదాల వితరణ.

**03.04.2024** ఉ॥ 8.00 గం॥లకు అవాహిత దేవతా మండప పూజలు, మూలమంత్ర హోమాలు , ధాన్యాధివాసం.
మం॥ 12.30 ని॥ లకు అన్న ప్రసాదాల కార్యక్రమం. సా॥ 5. 00 గం॥ లకు మండప పూజలు , ఆవాహిత దేవత హోమము, ప్రతిష్ఠ మూర్తులకు ఫల, పుష్ప, శయ్యాధివాసం, చతుర్వేద స్వస్తి.
రాత్రి 08.00 గం॥ లకు తీర్ధ ప్రసాదాల వితరణ.

**04.04.2024** ఉ॥ 6.00 గం॥లకు ప్రాత: కాల పూజలు , ఉ॥ 7.47 ని॥లకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహా ప్రతిష్ఠ, అనంతరం పూర్ణాహుతి, బలిహరణ కుంభ నివేదన , విగ్రహాలకు నెత్రోన్మీమిళనం, అనంతరం ,

పార్వతి పరమేశ్వర, రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల శాంతి కళ్యాణం, బ్రహ్మణ ఆశీర్వచనము.
బ్రహ్మ శ్రీ వేద మూర్తులు లోక శ్రీకాంత్ శర్మ గారి ఆధ్వర్యంలో జరుపబడును.

**ముఖ్యగమనిక :**
విరాళాలు సమర్పించు భక్తులు
దేవాలయం వద్ద
సంప్రదించవలసినదిగా కోరుచున్నాము.

లోకాః సమస్తా సుఖినో భవన్తు

ఆహ్వానించువారు.

## శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం

తుర్కయాంజాల్ 'X' రోడ్.



# వేసవిలో చర్మాన్ని కాపాడేదెలా?

రుతువులు మారే కొద్దీ, చర్మపు స్థితిగతులూ మారుతుంటాయి. శీతల కాలంలో అయితే మృత కణాలన్నీ ఒంటిమీద పేరుకుపోయి ఉంటాయి. వాటిని తొలగించే ఏ ప్రయత్నమూ చేయకపోతే, అవి అలాగే ఉండిపోయి మరికొన్ని ఇతర సమస్యలకు కూడా దారి తీస్తాయి. అందుకే...

- బాడీ సాల్ట్ ద్వారా గానీ, షుగర్ స్క్రబ్‌ల ద్వారా గానీ, ఒంటి మీద నిలిచి ఉన్న మృత కణాలను తొలగించుకోవాలి. ఇలా చేయడం వల్ల మృత కణాలు తొలగిపోవడమే కాదు, చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- మృత కణాలను తొలగించేంచుకు అవసరమైన మిశ్రమాన్ని స్వయంగానే తయారు చేసుకోవచ్చు. అందుకు బ్రౌన్ షుగర్, వైట్ షుగర్, ఆలివ్ ఆయిల్, కొన్ని ల్యావెండర్ ఎస్సెన్షియల్ ఆయిల్ చుక్కలు కలిపి ఈ మిశ్రమాన్ని తయారు చేసుకోవచ్చు.
- కేవలం ఆలివ్ నూనె, కొబ్బరినూనెతో మర్దన చేసినా చర్మానికి ఎంతో మేలు



కలుగుతుంది
- స్నానం పూర్తి కాగానే మంచి బాడీ లోషన్ ద్వారా గానీ క్రీము ద్వారా గానీ సున్నితంగా మర్దన చేయాలి.
- బాగా పండిన ఒక అరటిపండు, ఒక అవకాడో, మూడు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె కలిపి, స్వయంగానే కండీషనర్‌ను తయారు చేసుకుని వాడుకోవచ్చు.
- రోజుకు కనీసం 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి.
- పసుపు /ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు, నీలి /ఊదా ఈ ఐదు రంగుల్లో ఉండే పండ్లు, కూరగాయలు తరుచూ తింటూ ఉండాలి.
- శరీరానికి అవసరమైన కొవ్వు లభించే, అవకాడో, నెయ్యి, వెన్న, కొబ్బరినూనె, చేపలు, ముడిధాన్యాలు తరుచూ తినాలి.
- ఈ జాగ్రత్తల్లో ఏ కొన్ని పాటించినా, వేసవిలో చర్మం సంబంధమైన ఏ సమస్యలకు గురికాకుండా, చక్కని నిగారింపుతో ఉంటుంది.

## ధ్యానంతో తాగుడుకు చెక్

మద్యానికి బానిసలైన వాళ్లు తాగుడు మానాలని చాలా ప్రయత్నిస్తుంటారు. కానీ, తమను తాము నియంత్రించుకోలేక మళ్లీ అదే బాట పడుతుంటారు. అయితే, తాగుడుకు దూరం కావాలంటే ధ్యానం చేయాలని యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం 11 నిమిషాల పాటు ధ్యానం చేస్తే ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత ఏర్పడి మద్యం సేవించాలన్న భావనను దూరం చేస్తుందని వివరించారు. దాదాపు 68 మంది తాగుబోతులను వారం పాటు పరీక్షించగా వారిలో మద్యం సేవించాలన్న ఆలోచనే దూరం అయ్యిందని వెల్లడించారు. ఈ శాస్త్రవేత్తల బృందంలో భారత సంతతి శాస్త్రవేత్త కూడా ఉన్నారు.





# ఆమ్...తినిపిద్దాం!

పిల్లలకు 'ఆమ్' తినిపించడం అమ్మలకు పెద్ద సవాలు! అన్నప్రాసన రోజు నాటి ఆనందం ఆ తర్వాత తల్లులకు మిగలదు. పిల్లాడికి పెడుతున్నది సరిపోతోందో లేదో? పోషకాలు అన్నీ అందుతున్నాయో లేదో? అసలు పెట్టవలసినవన్నీ పెడుతున్నానో లేదో? ఇలా... తల్లులకు పిల్లల పోషణ గురించి లెక్కలేనన్ని అనుమానాలు! ఘనాహారం మొదలు పెట్టినప్పటి నుంచి పిల్లలకు ఏం తినిపించాలి? ఎలా వండాలి? వేటిని దూరం పెట్టాలి? ఈ విషయాల గురించిన అవగాహన ప్రతి తల్లికీ అవసరం.

ఆరో నెల నుంచి పిల్లలకు ఘనాహారం మొదలు పెట్టవచ్చనేది మనందరికీ తెలిసిన విషయమే! అయితే వంశపారంపర్యంగా నడుస్తూ వస్తున్నది, ఎక్కడో విన్నది, ఇరుగు పొరుగు సూచించేది, మార్కెట్లో దొరికే మిల్క్ ఫుడ్... వీటిలో దేన్ని అనుసరించాలనే అయోమయం ప్రారంభంలో ప్రతి తల్లికీ మొదలవుతుంది. చివరికు అందుబాటులో ఉన్నది, తేలికగా తయారయ్యేది, పెద్దలు సూచించినదాన్నే ఎంచుకుంటూ ఉంటారు. అయితే ఆరో నెల నుంచి సంవత్సరం వయసు వరకూ, ఏడాది వయసు నుంచి రెండేళ్ల వరకూ పిల్లలకు అందించే ఆహారంలో వయసు పరంగా మార్పులు చేస్తూ ఉండాలి. సరిపడా పోషకాలు అందేలా ఆహారాన్ని తయారు చేయడంలో రకరకాల పద్ధతులను ఎంచుకోవాలి. పిల్లలు ఇష్టంగా తినేలా నేర్పు, ఓర్పుతో వండి పెట్టాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఏ వయసు పిల్లలకు ఎలాంటి ఆహారం అవసరమో అవగాహన ఏర్పరుచుకోవాలి.

### 6 నుంచి 12 నెలల పిల్లలకు...

- ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి....
- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి.
- రుచి కోసం నెయ్యి వాడొచ్చు. కానీ చాలా పరిమితంగా వాడాలి. నెయ్యి బదులు ఎలాంటి వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ పదార్థాల రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు.
- నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే నీళ్లలో బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.
- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్ ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

### ఇవి కూడదు

- ఈ వయసు పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే....
- ఎలర్జీ తలెత్తకుండా ఉండాలంటే కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలనూ కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి ఎలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుసెనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకూడదు. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- 9 నెలల వరకూ గోధుమలు, గుడ్డు తినిపించకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు.
- గేదె, ఆవుపాలు, పెరుగు, పాల ఉత్పత్తులు ఇవ్వకూడదు.

### ఎలా తినిపించాలి?

చాలా మంది తల్లులు పిల్లలను ఒళ్లో పడుకోబెట్టుకుని స్పూన్‌తో ఆహారం తినిపిస్తూ ఉంటారు. కానీ పిల్లలను ఒళ్లోనే కూర్చోబెట్టుకుని తినిపించాలి. లేదంటే ఆహారం పొరపాటున ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. అలా జరగకుండా ఉండాలంటే ఒళ్లో లేదా మంచం మీద పిల్లలను 60 నుంచి 90 డిగ్రీల కోణంలో వెనక వీపు ఆనుకునేలా చూసుకుని తినిపించాలి. లేదంటే ఫీడింగ్ ఛైర్ వాడొచ్చు.

### 12 నుంచి 18 నెలల పిల్లలకు...

ఈ వయసు వచ్చేసరికి తల్లి పాలు కూడా తగ్గుతాయి కాబట్టి ఆ పాలకు బదులుగా అందాల్సిన పోషకాలన్నీ ఆహారం ద్వారా అందేలా చూడాలి. అందుకోసం రకరకాల పదార్థాలను పరిచయం చేయాలి. దంతాలు కూడా వచ్చి ఉంటాయి కాబట్టి పదార్థాలను మెత్తగా కాకుండా నమిలి తినగలిగే విధంగానే వండాలి. మూడు పూటలా ఘనాహారం తప్పనిసరిగా తినిపించాలి. అయితే ఈ వయసు పిల్లల పోషణలో కూడా కొన్ని పద్ధతులు పాటించాలి. అవేంటంటే....

- 18 నెలల వయసొచ్చేలోపు మనందరం తినే పదార్థాలను ఒక్కొక్కటిగా అలవాటు చేస్తూ పోవాలి.
- మాంసాహారం అలవాటు చేయాలనుకుంటే మొదట చికెన్ సూప్, తర్వాత చికెన్ కుర్మా... ఇలా ఒక క్రమ పద్ధతిని పాటించాలి.
- రాగులతో తయారైన వంటకాలు, బేబీ ఓట్లు ఇవ్వవచ్చు. కిచిడీ, రైస్ ఉప్మా, బొంబాయి రవ్వ ఉప్మా, రాగి ఇడ్లీ... ఇలా వీలైనన్ని ఎక్కువ పప్పుధాన్యాలను అలవాటు చేయాలి.
- ఈ వయసులో స్టార్చ్ (పిండి పదార్థం) ఉండే బంగాళా దుంపలు, చిలగడ దుంపలు, బీన్స్ అలవాటు చేయొచ్చు.
- పుల్లని పండ్లు సహా, రోజుకి రెండు రకాల పండ్లు తప్పనిసరిగా తినిపించాలి.
- కూరగాయలతో సూప్స్, రసాలు, సలాడ్లు ఈ వయసులోనే అలవాటు చేయాలి.
- బజార్లో దొరికే తీపి పదార్థాలకు బదులుగా బెల్లంతో చేసిన పాయసం, పొంగల్ లాంటివి అలవాటు చేయాలి.
- సాధ్యమైనంత వరకూ ఇంటి ఆహారాన్నే తినిపించాలి.
- శాకాహారులు సరిపడా మాంసకృత్తుల కోసం పుట్టగొడుగులు, సోయా, చిక్కుళ్లు పిల్లలకు వండి పెట్టాలి.
- వారానికోసారి ఇంట్లో తయారు చేసిన స్వీట్లు తినిపించవచ్చు. అరుదుగా చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ ఇప్పించవచ్చు.

### పిల్లల వెంట పడొద్దు

పిల్లలకు అన్నం తినిపించడాన్ని తల్లులు పెద్ద పనిగా పెట్టుకుంటూ ఉంటారు. కానీ ఆకలేస్తే పిల్లలు వాళ్లంతట వాళ్లే ఇష్టంగా, తమకు సరిపడా తింటారనే విషయాన్ని గ్రహించాలి. కుదురుగా కూర్చుని తినే పిల్లలు అరుదు. కాబట్టి వాళ్లకు కబుర్లు చెబుతూ, నడిపిస్తూ తినిపించవచ్చు. ఆహారాన్ని అందంగా తయారు చేసి పిల్లలను ఆకర్షించవచ్చు. కూరగాయలు, పండ్లను కార్టూన్ బొమ్మల్లా మలిస్తే పిల్లలే పరుగెత్తుకుంటూ వచ్చి తింటారు. ఇష్టపడని కూరగాయలు, పండ్లను ఇందుకోసం ఎంచుకోవచ్చు. పిల్లలు ఎంత తిన్నా సరిపడా తినలేదని తల్లులు దిగులు పడుతూ ఉంటారు. కానీ పిల్లల ఎత్తు వయసుతోపాటు సమంగా ఉంటే దిగులు పడవలసిన అవసరం లేదు. అలాగే కొంతమంది పిల్లలు సరిపడా తింటున్నా బరువు పెరగరు.

వీళ్ల విషయంలో ఎత్తు, చలాకీతనాలను గమనించాలి. అవి ఉంటే కంగారు పడవలసిన పని లేదు.

# అమ్మ పాలే అమృతం

బాల్యంలో కృత్రిమ పోషకాలు ఎన్ని ఇచ్చినా అవి తల్లిపాలకు ఎప్పుడూ సరిపోలేవనేది పరమ వాస్తవం. తల్లి పాలంటే కేవలం ఆకలి తీర్చడానికే అని కాదు. అవి శరీరాన్ని రోగగ్రస్థం చేసే అనేక రుగ్మతలకు అడ్డుకట్ట వేస్తాయి. నిజానికి, తల్లి పాలు తాగిన శిశువుకు కలిగే ప్రయోజనాలు అనేకం. వాటిల్లో ప్రధానంగా....

- తల్లిపాల వల్ల శరీరం అస్వస్థతకు గురయ్యే అవకాశం తగ్గడంతో




పాటు ఎలర్జీలకు తావు లేకుండా పోతుంది.
- బాల్యంలోనే స్థూలకాయం వచ్చే ప్రమాదం తప్పుతుంది. దాని వల్ల మునుముందు టైప్ 1, టైప్ 2 మధుమేహం బారిన పడే సమస్య తప్పుతుంది.
- చెవి ఇన్‌ఫెక్షన్లకు వీలుండదు. ఉదర సంబంధమైన వ్యాధులు దూరమవుతాయి.
- మెదడు గరిష్ఠంగా వృద్ధి చెందడానికి తల్లిపాలు గొప్ప ఔషధంలా పనిచేస్తాయి.
- పాలలోని పోషకాలు, శరీరాన్ని శక్తివంతంగా మార్చడంతో పాటు, మరే మార్గంలోనూ సాధ్యం కానంతగా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- పోలియో, టె టానస్, డిప్తీరియా, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా వంటి టీకాలు ఇచ్చినప్పుడు శరీరం వేగంగా స్పందిచేలా చేస్తాయి.
- దవడ భాగాల కదలికలు బావుండటంతో పాటు మునుముందు దంతక్షయం జరిగే అవకాశం లేకుండా పోతుంది.
- శ్వాసకోశాలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడటంలో తల్లి పాలు శక్తిమంతంగా పనిచేస్తాయి.
- పిల్లలు న్యుమోనియా, బ్రాంకైటిస్ వంటి జబ్బుల బారిన పడకుండా కాపాడతాయి.
- గ్రహణ శక్తి, జ్ఞాపక శక్తి పెరగడానికి తల్లి పాలు బాగా తోడ్పడతాయి.
- అందుకే ఏ పాలైనా ఒకటేనని, డబ్బా పాలతో సరిపెడదాం అని చూస్తే, అది పిల్లలను చేజేతులా జబ్బుల పాలు చేయడమేనని నిపుణులు చెబుతున్నారు.

# 'ఎందుకలా ఏడుస్తారూ'.. అంటే!

కొంతమంది పిల్లలు అయినదానికీ, కానిదానికీ అదేపనిగా ఏడుస్తుంటారు. 'ఏమైందీ? ఎందుకు ఏడుస్తున్నావు? ఏం కావాలి?' అంటూ ఎన్నిసార్లు అడిగినా ఏమీ చెప్పరు. ఎంత గుచ్చి గుచ్చి అడిగినా ప్రతిదానికీ అడ్డంగా తల ఊపడమే తప్ప నోట్లోంచి ఒక్క మాటా రాదు. ఆ తర్వాత తలిదండ్రులకు ఎక్కడలేని కోపం వచ్చేస్తుంది. చెడామడా తిట్టడమో, దబాదిబా బాదడమో చేస్తారు. దాంతో పిల్లల ఏడుపు ఇంకా రెట్టింపవుతుంది.

పిల్లలు ఇలా ఎందుకు ఏడుస్తారూ అంటే దానికి చాలా కారణాలే ఉన్నాయి. వాటిల్లో శారీరకంగా, మానసికంగా విపరీతంగా అలసిపోవడం కూడా ఒక కారణమే. స్కూలు ట్యూషన్...... ట్యూషన్ స్కూలు అంతా రంగుల రాట్నమేగా? ఆదివారం రోజున కూడా కొందరు పిల్లలు మరుసటి రోజు స్కూలు విషయాల గురించే ఆలోచిస్తూ ఉంటారు. ఇలా వారి శరీరమూ, మనసూ ఎడతెగకుండా అలసిపోతుంటాయి. ఆ అలసట అలా పెరిగి పెరిగి తట్టుకోలేక చివరికి ఏడుపు మొదలెడతారు. ఈ మాటంటే కొందరు పేరెంట్స్ "మిగతా పిల్లలెవరూ పడని కష్టాలు వీడొక్కడే పడుతున్నాడా?" అంటూ ప్రశ్నించవచ్చు. కానీ, పిల్లలందరి శక్తిసామర్థ్యాలు ఒకేలా ఉండవు కదా! మిగతా పిల్లల మాట ఎలా ఉన్నా, శారీరకంగా కాస్త బలహీనంగా ఉన్న పిల్లలు మిగతా పిల్లలకన్నా తొందరగా అలసిపోతుంటారు. అక్కడికీ మొండిగా, ఎంతో నిబ్బరంగా ఆ పనులన్నీ నెట్టుకు వస్తూనే ఉంటారు. కానీ, ఒకానొక దశలో ఆ నిబ్బరమంతా జారిపోయి, బావురుమని ఏడ్చేస్తారు.



అలాంటి పిల్లలను చీవాట్లు పెట్టకుండా తలిదండ్రులు వాళ్ల పట్ల సానుభూతితో వ్యవహరించాలి. అందులో ప్రథమంగా, వాళ్ల శక్తి సామర్థ్యాలను పెంచే ప్రయత్నాలు చేయాలి. అంతకన్నా ముందు వారికి ఆకలి సరిగా ఉంటోందా? లేదా? గమనించాలి. దానికి గల కారణాలేమిటో, దాన్ని అధిగమించే మార్గమేమిటో కనుక్కుని పాటించాలి. ఆకలి పెరిగిన తర్వాత సులభంగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలు, పండ్ల రసాలు, సూప్స్ తరుచూ అందించాలి. వీటివల్ల విటమిన్‌లోపాలు, లవణాల లోపాలు ఏమైనా ఉన్నా తీరిపోతాయి. దీనివల్ల చదువు సంబంధమైన ఒత్తిడిని తట్టుకునే శక్తి కొంత పెరుగుతుంది. ఆ తర్వాత అప్పుడప్పుడు మానసిక ఒత్తిడిని అధిగమించే మాటలు చెప్పాలి.

ముఖ్యంగా, "నువ్వు ఎంత కష్టపడి చదువుతున్నావో మాకు తెలియనిది కాదు. అయితే ఈ కష్టమే నీకొక అందమైన భవిష్యత్తును ఇస్తుంది. ప్రపంచంలో ఉన్నత స్థానాన్ని అందుకున్న వాళ్లంతా, ఈ కష్టాలన్నీ పడినవాళ్లే. అందువల్ల పైకి రావాలనుకునే ఎవరికైనా ఈ కష్టం తప్పదు. నీకూ తప్పదు" అంటూ వారిని సముదాయిస్తూనే, వారిలో స్ఫూర్తి నింపాలి. ఇలా వారి శారీరక దారుఢ్యాన్నీ, మనోబలాన్నీ పెంచడంతో వాళ్లల్లో నిబ్బరం పెరుగుతుంది. పిల్లల్లో సుడి తిరుగుతున్న వేదన హరించుకుపోయి ఏడుపు తగ్గిపోతుంది. ఆ క్రమంలో వాళ్లలో కష్టపడేతత్వం కూడా పెరుగుతుంది.

# ‘ప్రతినిధి 2’ ఇంటెన్స్ టీజర్



హీరో నారా రోహిత్ కమ్ బ్యాక్ చిత్రం ప్రతినిధి 2. ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు దర్శకత్వం రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. వానరా ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా ఆర్ట్స్ బ్యానర్‌లపై కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రతినిధి సిరీస్ నుండి రెండవ ఫ్రాంచైజీ అయిన ‘ప్రతినిధి 2’ టీజర్ మెగాస్టార్ చిరంజీవి ఈరోజులాంచ్ చేశారు. హీరో ఒక టీవీ ఛానెల్‌లో పనిచేసే నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్. ఒక అగ్ర రాజకీయ నాయకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో, అతను రాష్ట్రం యొక్క అప్పుల గురించి ఆరా తీయగా, 5 లక్షల కోట్లు సమాధానం ఇస్తాడు నాయకుడు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితే అప్పులు తీరుతాయని రాజకీయ నాయకుడు చెప్పగా.. అప్పుడు హీరో.. రాష్ట్రంలో నిజంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయా? అని ప్రశ్నిస్తాడు. చివరి ఎపిసోడ్‌లో హీరో ప్రజలను ఓట్లు వేయమని, లేకుంటే దేశం విడిచి వెళ్లమని హెచ్చరించడం ఆలోచన రేకెత్తిస్తుంది. టీజర్ లో సచిన్ ఖేడేకర్, రఘు బాబు, జిషు సేన్‌గుప్తా, ఉదయ భాను, అజయ్ గోష్, శ్రీ ఇతర ప్రముఖ పాత్రలను కూడా పరిచయం చేశారు. నాని చమిడిశెట్టి కెమెరా పనితనం నీట్ గా ఉంది, యువ సంచలనం మహతి స్వర సాగర్ తన అద్భుతమైన స్కోర్‌తో కథనానికి బలం చేకూర్చారు. రవితేజ గిరిజాల ఎడిటర్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. ప్రొడక్షన్ డిజైన్ గ్రాండ్‌గా వుంది.



# ‘లెజెండ్’ చలన చిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రం

గాడ్ ఆఫ్ మాసెస్ నటసింహ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కలిసి మూడు బ్లాక్ బస్టర్స్ అందించారు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్, వారాహి చలన చిత్రం బ్యానర్‌లపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర, సాయి కొర్రపాటి నిర్మించిన ‘లెజెండ్’ రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపధ్యంలో చిత్ర యూనిట్ లెజెండ్ బ్లాక్ బస్టర్ 10 ఇయర్స్ వేడుకలని ఘనంగా నిర్వహించారు.

లెజెండ్ బ్లాక్ బస్టర్ 10 ఇయర్స్ వేడుకలో గాడ్ ఆఫ్ మాసెస్ నటసింహ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. నాకు ధన్యమైన జన్మనిచ్చి, నన్ను మీ అందరి గుండెల్లో ఆయన ప్రతిరూపంగా నిలిపిన దైవాంశ సంభూతుడు, కారణజన్ముడు, విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, నా గురువు, నా దైవం, నా కన్నతండ్రికి పాదాభివందనం తెలియజేస్తున్నాను. ఈ వేడుకు సినిమా విడుదలకు ముందు జరుపుకునే పండగలాంటి అనుభూతిని ఇస్తుంది. ఎల్లుండి ఈ సినిమా రీరిలీజ్ అవుతుంది. మళ్ళీ వందరోజుల పండగ జరుపుకుంటాం. నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర, సాయి కొర్రపాటి గారికి శుభాకాంక్షలు అభిమానులకు, తోటికళాకారులకు అందరికీ హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. మంచి ఉద్దేశంతో సినిమాలు తీస్తే తెలుగు ప్రేక్షకులు ఎంతో గొప్పగా ఆదరిస్తారు. వెన్నుతట్టి ఇంకా ఇలాంటి మంచి సినిమాలు చేయాలని ప్రోత్సహిస్తారు. తెలుగు సినిమాల ప్రభావం యావత్ దేశానికి పాకిందంటే దాని ప్రభావం ఎంత వుందో కళ్ళముందు కనిపిస్తోంది. సినిమా రికార్డులు నాకు కొత్త కాదు. రికార్డులు సృష్టించాలన్నా నేనే. వాటిని తిరగరాయాలన్నా నేనే. నా దర్శకులు, కథ ఎంపిక, తోటి నటులు, సాంకేతిక నిపుణులు మీద నాకు గట్టి నమ్మకం. సమరసింహా రెడ్డి 30 కేంద్రాలలో సిల్వర్ జుబ్లీ చేసుకొని దేశంలో కొత్త రికార్డులు సృష్టించింది. 105 కేంద్రాలలో వందరోజులు ఆడిన సినిమా నరసింహ నాయుడు. 400 రోజులు నాలుగు ఆటలతో రెండు కేంద్రాలలో ఆడి ఇండస్ట్రీలో ఆల్ టైం రికార్డ్ గా నిలిచిన సినిమా లెజెండ్. లెజెండ్ లో మహిళలు ఉద్దేశించి ఇచ్చిన అద్భుతమైన సందేశం వుంది. ఇటీవలే వచ్చిన నేలకొండ భగవంత్ కేసరిలో కూడా చాలా చక్కని సందేశం ఇచ్చాం. కళామతల్లి, నా తల్లితండ్రుల, అభిమానుల ఆశీస్సులు వుండబట్టే ఇలాంటి మంచి సినిమాలు చేయగలుతున్నానని భావిస్తున్నాను. చలన చిత్ర పరిశ్రమలో చిరస్థాయిగా నిలిచిపోయిన చిత్రాల్లో చెప్పుకోదగ్గ సినిమా లెజండ్. సింహ, లెజెండ్, అఖండ, నేలకొండ భగవంత్ కేసరి...ఈ చిత్రాలన్నీ తృప్తిని ఇవ్వడంతో పాటు ఇంకా మంచి సినిమాలు చేయాలనే కసి పెంచాయి. 2014 ఎలక్షన్స్ కి ముందు లెజెండ్ విడుదలైయింది. దాని ప్రభావం ఎన్నికలపై ఎంత వుందో మనకి తెలుసు. మళ్ళీ ఎన్నికలు రాబోతున్నాయి. యాదృచ్ఛికంగా సినిమా మళ్ళీ విడుదల కాబోతుంది. సినిమా ఎంత ప్రభావం వుంటుందో రేపు ఎన్నికల్లో చూడబోతున్నారు. జయం మనదే. దర్శకులు బోయపాటి గారు, నేను ఒక సినిమా చేస్తున్నపుడు మరో సినిమా గురించి ఆలోచించము. రేపు జరబోయే సినిమా గురించి కూడా మాట్లాడుకోం. మేము మాటల మనుషులం కాదు. చేసి చూపిస్తాం. మా ఆలోచనలు ఒకటే. రామ్ ప్రసాద్ గారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. దేవిశ్రీ ప్రసాద్ ఆణిముత్యాలు లాంటి పాటలు సమకూర్చారు. సాంకేతిక నిపుణులంతా అద్భుతంగా పని చేశారు. సోనాల్ చౌహాన్ అందం అభినయంతో ఆకట్టుకున్నారు. అలాగే రాధిక ఆప్టే గారు కూడా చక్కని అభినయం కనబరిచారు. జగపతి బాబు గారు తన పాత్రలో చాలా అద్భుతంగా రాణించారు. లెజెండ్ ని అప్పుడు అంత విజయం చేసినందుకు, రేపు చేయబోతునందుకు అభిమానులకు, ప్రేక్షకులకు, తెలుగు చిత్ర పరిశ్రమకు ధన్యవాదాలు” తెలిపారు.

# టిల్లు స్క్వేర్’ వంద కోట్లు వసూలు చేస్తుంది : సూర్యదేవర నాగవంశీ

2022లో విడుదలై ఘన విజయం సాధించిన ‘డీజే టిల్లు’ చిత్రానికి సీక్వెల్ గా రూపొందిన చిత్రం ‘టిల్లు స్క్వేర్’. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. భారీ అంచనాలతో ‘టిల్లు స్క్వేర్’ సినిమా నేడు(మార్చి 29) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తూ మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ తెచ్చుకున్న ఈ సినిమా సంచలన వసూళ్ల దిశగా దూసుకుపోతోంది. ఈ విజయానందంలో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం తమ సంతోషాన్ని ప్రేక్షకులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. “ ముందుగా నేను నిర్మాత నాగవంశీ గారికి, చినబాబు గారికి, త్రివిక్రమ్ గారికి థాంక్స్ చెప్పాలి. నన్ను నమ్మి, ఇలాంటి సబ్జెక్టుని నమ్మి, మంచి బడ్జెట్ తో ‘డీజే టిల్లు’ చిత్రాన్ని రూపొందించారు. ఆ సినిమా ఘన విజయం సాధించింది. ఆ తర్వాత సీక్వెల్ అవకాశం కూడా ఇచ్చారు. టిల్లు స్క్వేర్ కి థియేటర్లలో మంచి స్పందన లభిస్తుండటం ఆనందం కలిగిస్తోంది. విడుదలకు ముందే ఈ సినిమా అదిరిపోతుంది అని నాకు తెలుసు. కానీ విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి ఆ మాట వినాలని ఆగాను. ఇప్పుడు చెబుతున్నాను ఈ సినిమా అదిరిపోయింది. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.” అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. “ఈ సినిమా వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తుందనే నమ్మకం ఉంది. సినిమాకి మంచి టాక్ వస్తోంది. మార్నింగ్ షోకి, మ్యాట్నీకి వసూళ్లలో గ్రోత్ కనిపిస్తుంది. ఉగాది, రంజాన్ పండగలు, వేసవి సెలవులు ఉండటంతో ఈ సినిమా వంద కోట్లు వసూలు చేస్తుందనేని నమ్ముతున్నాను.” అన్నారు.

ఈ కార్యక్రమంలో కళ్యాణ్ శంకర్, రవి ఆంథోనీ, ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొని తమ సంతోషాన్ని పంచుకున్నారు.





## ‘మెకానిక్ రాకీ’- ఫస్ట్ లుక్ పోస్టర్

‘గామి’ సక్సెస్‌తో దూసుకుపోతున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా, అతని మైల్ స్టోన్ VS10 మూవీ మేకర్స్ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కొత్త దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ చిత్రంలో విశ్వక్ సేన్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది.

ఈ చిత్రానికి ‘మెకానిక్ రాకీ’ అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. టైటిల్ పోస్టర్ ని క్రియేటివ్ గా డిజైన్ చేసారు. పోస్టర్ లో రాకీగా విశ్వక్ ఇమేజ్ ని మనం చూడవచ్చు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విశ్వక్ సేన్ మాస్ ను పవర్ ఫుల్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. అతను చేతిలో పెద్ద రెంచ్‌తో సిగరెట్ తాగుతూ కొంటె చూపుతో కనిపించారు. లైట్ గడ్డంతో, స్టైలిష్ దుస్తులను ధరించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మెకానిక్ షెడ్‌ని మనం చూడవచ్చు. టైటిల్ లోగో, ఫస్ట్ లుక్ పోస్టర్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కామెడీ,యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.



## ఏప్రిల్ 12న ‘డియర్’

జివి ప్రకాష్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న కామెడీ ఫ్యామిలీ డ్రామా ‘డియర్’. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. నట్‌మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదలకు ఒక్కరోజు గ్యాప్ ఉంటుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న విడుదల కానుండగా, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానుంది. ఈ సినిమా ఆంధ్రా థియేట్రికల్ హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్ కొనుగోలు చేయగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. హ్యూజ్ థియేట్రికల్ చైన్ బిజినెస్లు ఉన్న ప్రొడక్షన్ , డిస్ట్రిబ్యూషన్ సంస్థల బ్యాకింగ్ తో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో చాలా గ్రాండ్ గా విడుదల కానుంది.


ఈ చిత్రానికి సంగీతం జివి ప్రకాష్ కుమార్ అందించారు, ఇటీవలి చార్ట్‌బస్టర్ పాట “మాస్టారు మాస్టారు” ఇప్పటికీ చార్టులలో కొనసాగుతోంది.



# “ఫ్యామిలీ స్టార్” సక్సెస్‌పై సూపర్ కాన్ఫిడెంట్‌గా ఉన్న డైరెక్టర్ పరశురామ్ పెట్ల

సకుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించేలా సినిమాలు రూపొందించడం కొందరు దర్శకులకే సాధ్యమవుతుంది. అలాంటి టాలెంటెడ్ డైరెక్టర్ పరశురామ్ పెట్ల. సోలో, శ్రీరస్తు శుభమస్తు, గీత గోవిందం లాంటి కుటుంబ కథా చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్నారీ డైరెక్టర్. విజయ్ దేవరకొండ హీరోగా ఆయన రూపొందించిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ “ఫ్యామిలీ స్టార్”. ఈ సినిమా ట్రైలర్ రీసెంట్ గా రిలీజై సినిమా మీద మరింత హైప్ పెంచుతోంది. ట్రైలర్ ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పరశురామ్ పెట్ల తనదైన హీరో క్యారెక్టరైజేషన్, మేకింగ్ స్టైల్ ను “ఫ్యామిలీ స్టార్”లో మరోసారి చూపించారు. ఈ సినిమా సక్సెస్ పై సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు పరశురామ్ పెట్ల. అందుకే ఆయన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ‘ ఐ ఫీస్ట్ లాంటి “ఫ్యామిలీ స్టార్” సినిమాను, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు, ప్రతి తెలుగు కుటుంబం కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటారు.’ అని చెప్పారు. సమ్మర్ లో సకుటుంబంగా ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసే మూవీ “ఫ్యామిలీ స్టార్” అని ట్రైలర్ ప్రామిస్ చేస్తోంది. “ఫ్యామిలీ స్టార్” సినిమాను ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ నిర్మించారు.





# మాడు పగిలే ఎండలు..

### భగభగమండుతున్న ఎండలు
### తెలంగాణలో పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు
### ఏప్రిల్ నుంచి పెరగనున్న వడగాల్పులు

**హైదరాబాద్,మార్చి29(వెలుతురు):** హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. శుక్రవారం ఆదిలాబాద్‌లో 43.3, నల్గొండ జిల్లా నాంపల్లిలో 43, గద్వాల్ 42.8, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దనొరాలో 42.7, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ తెలిపింది. ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో రాష్ట్రంలో వడగాల్పులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒకటిన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశముందని వెల్లడించింది. 2న ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది.

# కడియం ప్రజలందరినీ మోసం చేసిండు

### తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదకారి కడియం
### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ విమర్శలు

**హైదరాబాద్,మార్చి29(వెలుతురు):** ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ కేసీఆర్ కు అండగా కడియం ను గెలిపిస్తే అందరినీ మోసం చేసిండని ఆయన మండిపడ్డారు. డబ్బులకు లొంగి , పదవుల పేరుతో బిఆర్ఎస్ కు , తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదకారిగా కడియం తయారయ్యాడని పల్లా వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో , మాదిగ పోరాట సమితి ఉద్యమంలో లేడు కానీ నేనే గొప్ప అని చెబుతూ అహంకారంతో అందరినీ మోసం చేస్తున్నాడని, వ్యక్తిగతంగా మాదిగలకు ఏం చేసిన వ్యక్తి కడియం కాదన్నారు పల్లా రాజేశ్వర్ రెడ్డి. ఆనాడు ఎన్టీఆర్ కు , ఈరోజు కెసిఆర్ కు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కడియం శ్రీహరి అని, ప్రజలు చి కొడుతారు . నోట్లో ఉమ్మి వేసి , చెప్పులతో కొడతారన్నారు. ముసలి వయసులో , ముసలి నక్క లాగా మా ప్రాంత ప్రజలను మోసం చేసినవని, నీకు సిగ్గు శరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ అని ఆయన డిమాండ్ చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే లేని లోటు నేను తీరుస్తానని, జనగాం తో పాటు , స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ లను రెండు కండ్ల లాగా కాపాడుకుంటానన్నారు పల్లా రాజేశ్వర్ రెడ్డి. ఇక్కడ ఎమ్మెల్యే లేని లోటు తీరుస్తా.. కార్యకర్తల్ని కంటికి రెప్పలా కాపాడుతానని అన్నారు.మీ మాయమాటలు, బెదిరింపులకు.. ఉడుత ఊపులకు ఎవరూ భయపడరన్నారు. వచ్చే ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో మాదిగ బిడ్డను గెలిపించుకుందామన్నారు. ఈ ప్రాంత బిడ్డగా మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండి పని చేస్తా అని అన్నారు పల్లా. కడియం శ్రీహరిని బీఆర్ఎస్ తరఫున నిలబడితే స్టేషన్ ఘనపూర్ ప్రజలు గెలిపిస్తే .. కుట్రపూరితంగా ఒక్కొక్కరిని పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపించారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.

# జమ్మూకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

### లోయలో పడిన కారు.. 10 మంది మృతి

**జమ్మూకాశ్మీర్,మార్చి29(వెలుతురు):** జమ్మూకాశ్మీర్‌లో దారుణమైన ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారులోని ప్రయాణిస్తున్న 10 మంది అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలుస్తోంది. ప్రయాణికు లతో కలిసి ఓ కారు జమ్మూకాశ్మీర్ జాతీయ రహదారి రాంబన్ ప్రాంతం వైపు వెళ్తోంది. వేగంగా వచ్చిన కారు.. ముందు టర్నింగ్ గమనించలేదు. దీంతో కారు ప్రమాదవశాత్తూ లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో దాదాపు పది మంది అక్కడికక్కడే మృతి చెందినట్టు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, సివిల్ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు అక్కడికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టాయి. కారులోంచి మృతదేహాలను బయటకుతీసి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు మొదలుపెట్టారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సిఉంది.

# దక్షిణాఫ్రికాలో విషాధ ఘటన

### లోయలో పడిన బస్సు.. 45 మంది మృతి

**లింపోపో,మార్చి29(వెలుతురు):** క్రిస్టియన్ల పవిత్రమైన పండుగ గుడ్ ఫ్రైడే వేళ దక్షిణాఫ్రికాలో విషాధ ఘటన వెలుగుచూసింది. ప్రయాణికులతో వెళుతున్న ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. మొత్తం 46 మందితో ప్రయాణిస్తున్న బస్సు లోయలో పడిపోవడంతో 45 మంది మృతి యెందగా, ఒక్క చిన్నారి మాత్రం ప్రాణాలతో బయటపడింది. దాదాపు 165 అడుగుల లోతులో బస్సు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. లోయలో పడిన వెంటనే బస్సులో మంటలు చెరిగాయని అనంతరం బస్సు మొత్తం మంటల్లో కాలిపోయినట్లు తెలిపారు. ఈ ఘటన దక్షిణాఫ్రికాలోని లింపోపోలోని మమట్లకల సమీపంలో వెలుగుచూసింది. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే వీరంతా ఈస్టర్ పండుగ నేపథ్యంలో చర్చికి వెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. ప్రయాణికులు బస్సు బోట్స్వానా నుంచి లింపోపోలోని మోరియాకు వెళ్తుంది. అయితే ప్రమాదానికి గల కారణాన్ని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోయిన కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దక్షిణాఫ్రికా రవాణా మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.మృతదేహాలను సహాయచర్యలు చేపట్టి విపత్తు నిర్వాహక సిబ్బంది బయటకు తీస్తుంది. ఇందులో ఎనిమిదేళ్ల చిన్నారి గాయాలతో ప్రాణాలతో బయటపడింది. ప్రస్తుతం ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్నారు.

# బీఆర్ఎస్ పనైపోయింది..

### ఆ పార్టీ గురించి మాట్లాడటం వృథా : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి29(వెలుతురు):** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణలో రాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఆసక్తికర పోరు నడుస్తోంది. అయితే బీఆర్ఎస్ నుంచి కేకే, కడియం, దానం లాంటివాళ్లు పార్టీ వీడటంతో అలాంటివాళ్లకు ప్రజలే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ రియాక్ట్ అయిన విషయం తెలిసిందే. ఇక ఇదే అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందిస్తూ "ఇదేం పార్టీకి కొత్తకాదు.. తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టినప్పుడు పట్టుమని 10 మంది కూడా పార్టీలో లేరు, పాతవాళ్లు పోయినా కొత్తరక్తంతో నింపుతాం" అని అన్నారు.అయితే ఇదే విషయమై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పనైపోయిందని, వారి గురించి మాట్లాడటం వృథా అని రియాక్ట్ అయ్యారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం

### టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసును నమోదు
### దేశంలో తొలి కేసుగా గుర్తింపు
### ఇద్దరు అధికారులకు ఐదురోజుల కస్టడీ

**హైదరాబాద్,మార్చి29(వెలుతురు):** గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం సంచలనంగా మారింది. ఈ ఫోను ట్యాపింగ్ కేసుపై శుక్రవారం అధికారికంగా బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసును నమోదు చేశారు. దేశంలోనే తొలిసారిగా టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసు నమోదు అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు.. శుక్రవారం దేశ వ్యాప్తంగా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద నమోదైన తొలి కేసుగా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు గుర్తింపు పొందింది. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశారు. కేసులో ఏ3గా ఉన్న సిటీ టాస్క్ పోర్స్ మాజీ డీఎస్పీ రాధాకిషన్ రావును శుక్రవారం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏప్రిల్ 11వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ప్రస్తుతం అతన్ని పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న కొద్దీ రోజురోజుకీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఎవరెవలు భాగస్వాములు అయ్యారనే విషయాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు విచారణలో ఒక్కో విషయం వెల్లడిస్తున్నారు.

ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాలు నేతలు, పారిశ్రామిక వేత్తలను టార్గెట్ చేసుకుని ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు ప్రణీత్ రావు తెలిపారు. ఈ కేసులో తనతో పాటుగా నాటి ఇంటెలిజన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు ప్రభాకర్ రావును ఏ1గా గుర్తించి కేసు నమోదు చేశారు. ప్రణీత్(ఏ2), సిటీ టాస్క్ పోర్స్ మాజీ డీఎస్సీ రాధాకిషన్ రావును(ఏ3), భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ భుజంగరావును ఏ4గా, తిరుపతన్నను ఏ5గా గుర్తించి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఏ3గా ఉన్న రాధాకిషన్ రావును శు క్రవారం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును అరెస్ట్ చేసిన పోలీసులు, మిగతావారిపై దృష్టి పెట్టారు. మరో ముగ్గురు అధికారులు విదేశాలకు వెళ్లినట్టు భావించిన అధికారులు.. వారిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. గురువారం ఉదయం మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఇంటికి పోలీసులు వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ప్రణీత్‌రావుకు రాధాకిషన్‌రావు ఇచ్చిన ఆదేశాలపై పోలీసులు విచారించారు. ముఖ్యంగా ఫోన్‌ట్యాపింగ్ సమాచారంతో ఎక్కడెక్కడ ఆపరేషన్ చేపట్టారు? హవాలా



లావాదేవీల క్రమంలో ఏం జరిగింది? వ్యాపారులను బెదిరించి అక్రమంగా డబ్బు సంపాదించారన్న ఆరోపణలపై గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అటు రాధాకిషన్‌రావు, గట్టుమల్లును పోలీసులు విచారిస్తున్న క్రమంలో బేగంబజార్‌లో కొందరు వ్యాపారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. అప్పట్లో టాస్క్‌ఫోర్స్ తరచూ బేగంబజార్‌లో సోదాలు నిర్వహించేది. ఆ ప్రాంతంలో గంజాయి, హవాలా దందాల్లో ప్రమేయమున్న వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులతో టాస్క్‌ఫోర్స్ అధికారులతో రిలేషన్ ఏర్పడిందనే ప్రచారమూ లేకపోలేదు.

రాధాకిషన్‌రావు, గట్టుమల్లులను విచారిస్తున్న విషయం బయటకు రాగానే ఈ వ్యాపారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సమాచారం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో సుదీర్ఘంగా పనిచేసిన రాధాకిషన్‌రావుతోపాటు ఆయన టీమ్‌పై పలు ఆరోపణ లు ఉన్నాయి. ఆయన మల్కాజ్‌గిరి ఏసీపీగా ఉన్న సమయంలో ఓ కాంగ్రెస్ నేత ఆత్మహత్యకు కారణమయ్యారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. విచారణ తర్వాత ఆ కేసు నుంచి బయటపడ్డారు. ఉద్యోగ విరమణ తర్వాత రెండు విడతలుగా ఆయనే ఓఎస్డీగా కొనసాగడం వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉన్నాయనే వార్తలు లేకపోలేదు.అయితే శాసనసభ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో రాధాకిషన్‌రావుపై అప్పటి కమిషనర్ సందీప్ శాండిల్య ఎన్నికల కమిషనర్‌కు ప్రత్యేక నివేదిక పంపడంతో ఆయనను టాస్క్‌ఫోర్స్ బాధ్యతల నుంచి తప్పించారు. ప్రభుత్వం మారడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఇదిలావుండగా మరో ముగ్గురు టాస్క్‌ఫోర్స్ పోలీసులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి ఫోన్లను అధికారులు స్వాధీనం చేశారు. క్షేత్రస్థాయి ఆపరేషన్లలో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. ఇక ప్రణీత్‌రావుకు డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తితోపాటు ఓ కానిస్టేబుల్ సైతం పోలీసుల అదుపులో వున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా డిసెంబర్ నాలుగున ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడంతోపాటు వాటిని మూసీ నదిలో పారేయడం వెనుక వీరి ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను ఐదురోజుల పోలీసుల కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం నుంచి ఏప్రిల్ రెండు వరకు కస్టడీ విధించింది.

# లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు షాక్

### కాంగ్రెస్ పార్టీకి మరోసారి ఐటీ నోటీసులు
### 1,700 కోట్ల చెల్లించాలంటూ నోటీసు
### దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు
### ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్యే
### కాంగ్రెస్ అడ్వకేట్, ఎంపీ వివేక్ తంఖా

**న్యూఢిల్లీ,మార్చి29(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికల వేళ ఐటీ వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడటం లేదు. ఈ అంశంలో ఆ పార్టీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి ఐటీ శాఖ మరోసారి నోటీసులు ఇచ్చింది. నోటీసుల విషయాన్ని కాంగ్రెస్ అడ్వకేట్, ఎంపీ వివేక్ తంఖా శుక్రవారం తెలిపారు. తమపై ఐటీ శాఖ ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. వెంటనే ఆ పార్టీకి నోటీసులు ఇచ్చింది ఐటీ శాఖ. 2017-18 నుంచి 2020-21 వరకు సంబంధించిన పెనాల్టీ, వడ్డీ కలిసి 1700 కోట్ల రూపాయలను తేల్చింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. నేరుగా నోటీసులు ఇవ్వడంపై ఎంపీ వివేక్ తంఖా మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్యగా వర్ణించారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా ఇబ్బందులు గురిచేయడానికి మోదీ సర్కార్ ప్లాన్ చేసినట్టు దుయ్యబట్టారు. దీనిపై చట్టపరంగా ఫైట్ చేస్తామన్నారు. ఆదాయపు పన్ను శాఖ చేపట్టిన ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మదింపు ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన ఆధారాలు ఐటీ అధికారుల వద్ద ఉన్నాయని, ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. గతంలోనూ 2014 నుంచి 2017 వరకు సంబంధించిన ఐటీ వ్యవహారాలపై న్యాయస్థానం తిరస్కరించింది. ఇప్పటికే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి దాదాపు 135 కోట్ల రూపాయలను రికవరీ చేసుకుంది ఐటీ విభాగం. ఐటీ శాఖ నోటీసులపై కాంగ్రెస్ మండిపడుతోంది. సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆ పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. తమపై ఐటీ చర్యలను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన వెంటనే.. కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు జారీ చేసింది. 2017-18, 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీ వసూలుకు రూ.1823 కోట్లు చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఎన్నికల్లో డబ్బు లేదని ఆ పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్న సమయంలో మరోసారి ఐటీ నోటీసులు ఇవ్వడంపై సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీ శాఖ నోటీసులను నిరసిస్తూ కాంగ్రెస్ హైకమాండ్ నిరసనలకు పిలుపునిచ్చింది. శనివారం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు చేపట్టాలని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్ర విభాగాలను కోరారు. పీసీసీ ప్రధాన కార్యాలయాల దగ్గర, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయాల దగ్గర ధర్నా చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేందుకే కేంద్రం ఇలా పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతోందని కాంగ్రెస్ మండిపడింది.

# మాండ్య నుంచి బరిలో కుమారస్వామి

### అభ్యర్థులను ప్రకటించిన జేడీఎస్

**మాండ్య,మార్చి29(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి బరిలోకి దిగుతున్నారు. దాదాపు 10 ఏళ్ల తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ఆయన ఎంట్రీ ఇస్తున్నారు. శుక్రవారం విడుదల చేసిన జేడీఎస్ జాబితాలో కుమారస్వామి పేరు ప్రకటించారు. మాండ్య నుంచి కుమారస్వామి పోటీ చేస్తున్నారు. మాండ్యతో పాటు హాసన్, కోలార్ నియోజకవర్గాలకు కూడా అభ్యర్థులను వెల్లడించింది. హాసన్ నుంచి ప్రస్తుత ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, కోలార్ నియోజకవర్గం నుంచి ఎం. మల్లేష్ బాబు బరిలో నిలిచారు.కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ మధ్య పొత్తు కుదిరింది. లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా బరిలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా జేడీఎస్ మూడు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. దీంతో శుక్రవారం జేడీఎస్ అధిష్టానం అభ్యర్థుల పేర్లు ప్రకటించింది. కుమారస్వామి ప్రస్తుతం చన్నపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి ఆయన పార్లమెంట్‌కు వెళ్లాలని భావించారు. దీంతో మాండ్య నుంచి కుమారస్వామి బరిలోకి దిగుతున్నారు.ఇదిలా ఉంటే ఇటీవలే కుమారస్వామికి హార్ట్ సర్జరీ జరిగింది. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో లోక్‌సభ బరిలోకి దిగుతున్నారు. దాదాపు పదేళ్ల విరామం తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో చిక్కబల్లాపూర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక ప్రజ్వల్ రేవణ్ణ.. జేడీఎస్ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు, కుమారస్వామి మేనల్లుడు. వరుసగా రెండోసారి హాసన్ నుంచి బరిలోకి దిగుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. ఇక కోలార్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా ఎం. మల్లేష్ బాబు నిలిచారు. 2023 ఎన్నికల్లో బంగారుపేట (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఎన్ నారాయణస్వామి చేతిలో ఓడిపోయారు. కుల సమీకరణలతో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పార్టీ అభ్యర్థులను ప్రకటించినట్లు జేడీఎస్ ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. 2019 ఎన్నికల్లో కుమారస్వామి కుమారుడు నిఖిల్ మాండ్య లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి సుమలత అంబరీష్ విజయం సాధించారు. ఈసారి కుమారస్వామిని పోటీకి ఒప్పించడంలో బీజేపీ హైకమాండ్ కీలక పాత్ర పోషించిందని తెలుస్తోంది. ఇక బీజేపీ పోటీ చేస్తున్న 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ 24 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను వెల్లడించింది. కర్ణాటకలో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 26న దక్షిణ కర్ణాటక నియోజకవర్గాలకు మొదటి దశలో.. మే 7న ఉత్తర కర్ణాటకలో రెండో దశలో పోలింగ్ జరగనుంది. మొత్తం దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ జరగనుంది. చివరి విడత జూన్ 1న జరగనుంది. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్నాయి.

# నేత కార్మికుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### సిరిసిల్ల వస్త్ర సంక్షోభంపై సీఎం రేవంత్‌కు బండి లేఖ

**హైదరాబాద్,మార్చి29(వెలుతురు):**
సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ లేఖ రాశారు. సిరిసిల్ల నేత కార్మికుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, విద్యుత్ సబ్సిడీలను కొనసాగించాలని లేఖలో కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం వల్ల గత 4 నెలలుగా యజమానులు, నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన పాత బకాయిలు 270 కోట్ల రూపాయలు ఇంతవరకు చెల్లించలేదని.. వాటిని చెల్లించాలని ఆయన లేఖలో కోరారు. కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని.. ఫలితంగా వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి పని చేస్తున్న దాదాపు 20 వేల మంది పవర్ లూమ్, అనుబంధ రంగాల కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. "అప్పులు చేస్తూ ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బకాయిలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని గత 27 రోజులుగా చేనేత కార్మికులు సమ్మె చేస్తున్నారు. కానీ ప్రభుత్వం నుండి ఇంతవరకు కనీస స్పందన లేకపోవడం బాధాకరం." బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.గత ప్రభుత్వం బతుకమ్మ చీరలు ప్రవేశపెట్టి ఖచ్చితంగా బతుకమ్మ చీరలను నేయాలంటూ ఆసాములను, యజమానులపై ఒత్తిడి చేసి పాత వ్యాపారాలను బంద్ చేయించిందన్నారు. ఆ తరువాత మాస్టర్ వీవర్స్ పేరుతో పెద్ద యజమానులకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి చిన్న యజమానులను, ఆసాములుగా కూలీలుగా మార్చిందన్నారు. బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన యజమానులకు సైతం ప్రభుత్వం నుండి సక్రమంగా పేమెంట్లు రాకపోవడంతో దాదాపు రూ.270 కోట్ల మేరకు బకాయిలు పేరుకుపోయాయన్నారు. దీంతో వ్యాపారాలు చేయడానికి డబ్బుల్లేక, కొత్త ఆర్డర్లు లేక యజమానులు వస్త్ర పరిశ్రమను బంద్ పెట్టారని.. ఫలితంగా పరిశ్రమతోపాటు అనుబంధంగా ఉన్న వార్పిన్, సైజింగ్, డైయింగ్ రంగాలపై ఆధారపడి బతుకుతున్న వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

గత 27 రోజులుగా ఆసాములు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని బండి సంజయ్ వెల్లడించారు. వారి డిమాండ్లు న్యాయమైనవేనని.. వెంటనే మీరు స్పందించి సమ్మె విరమింపజేయడంతోపాటు ప్రభుత్వ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.అట్లాగే పవర్ లూం కారా?నాలకు గత 24 సంవత్సరాల నుండి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్ ను నిలిపివేయడంతో రెట్టింపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. ఆసాములు ఆ బిల్లులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని.. దీంతో కోట్లాది రూపాయల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని లేఖ ద్వారా సీఎం రేవంత్‌కు తెలిపారు. తక్షణమే విద్యుత్ బకాయిలను మాఫీ చేయడంతోపాటు విద్యుత్ సబ్సిడీని యథావిధిగా కొనసాగించాలని కోరుతున్నామన్నారు. దీంతోపాటు కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. నేత కార్మికుడిని ఆసామి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.370 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకం అర్ధాంతరంగా నిలిచిపోయిందని.. ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించడంతోపాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం నుండి అధిగమించేలా అన్ని చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com